ప్రజాశక్తి

శనివారం 7 సెప్టెంబర్ 2024 | 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

రహదారులు ఛిన్నాభిన్నం

భారీ వర్షాలతో వాహనదారుల ఇక్కట్లు - తక్షణ మరమ్మతులకు నిధుల కోసం ఎదురుచూపులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగండం ప్రభావంతో గత శనివారం కురిసిన అతి భారీ వర్షాలకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలు రహదారులు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న రహదారులకు తక్షణ మరమ్మతులు చేయకపోతే వాహనదారులు వెళ్లే పరిస్థితి లేదని ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. దెబ్బతిన్న రహదారుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను ఈనెల 10వ తేదీ కల్లా పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. గుంటూరు జిల్లాలో 350 కిలో మీటర్లు, పల్నాడు జిల్లాలో దాదాపు 250 కిలో మీటర్ల మేరకు రహదారులు దెబ్బతిన్నట్టు ప్రాథమిక అంచనాలను బట్టి తెలుస్తోంది.

గత శనివారం అతి భారీ వర్షం కురిసిన గుంటూరు, తెనాలి, మంగళగిరి, పత్తిపాడు, పొన్నూరు నియోజకవర్గాల్లో రహదారులు బాగా దెబ్బతిన్నాయి. ఇప్పటికే అధ్వానంగా ఉన్న గుంటూరు-పలకలూరు, తాడికొండ-కంతేరు అడ్డరోడ్డు, పెదపరిమి-తుళ్లూరు, మంగళగిరి- పెదపరిమి, తెనాలి-నారా కోడూరు, నారాకోడూరు-చందోలు, తాడికొండ-రావెల, నిడుముక్కల-మోతడక, అమరావతి-తుళ్లూరు, మంగళగిరి- మందడం, తెనాలి-మంగళగిరి, గుంటూరు-బుడంపాడు రహదారులు మరింత దెబ్బతిన్నాయి. అచ్చంపేట-మాదిపాడు-పులిచింతల, రొంపిచర్ల -విప్పర్ల, అమరావతి-సత్తెనపల్లి-క్రోసూరు-పెదకూరపాడు, గుంటూరు-ప్రత్తిపాడు -పెదనందిపాడు, పెదనందిపాడు-చిలకలూరిపేట, గుంటూరు-పేరేచెర్ల-కొండమోడు రహదారులు బాగా దెబ్బతిన్నాయి. ఇప్పటికి

▶ 2లో

ముంపు సమస్యను పరిష్కరిస్తాం

- కేంద్ర ప్రభుత్వ సహకారంతో బాధితులను ఆదుకుంటాం
- వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర మంత్రి చంద్రశేఖర్ పరిశీలన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పైర్లు నీట మునిగిన నేపథ్యంలో బాధిత రైతులకు ప్రభుత్వపరంగా అండగా నిలుస్తామని, బీమా, సబ్సిడీ, ప్రభుత్వ పథకాల ద్వారా ఆదుకుంటామని గ్రామీణాభివద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. అన్నవరం - అన్నవరపు లంక మధ్యన వంతెన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, గుంటూరు జిల్లా కలెక్టర్‌తో కలిసి ఆయన శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. కొల్లిపర మండలంలోని అన్నవరపు లంక, కొత్తూరు లంక, తెనాలి మండలంలోని బుర్రిపాలెం, చక్రాయపాలెం, కొలకలూరు ఖాజీపేట, హాఫ్‌పేట గ్రామాల్లో

▶ 2లో

వరద బాధితులకు పరిహారం ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన రైతులను, ఇళ్లు మునిగిపోయిన ప్రజలకు తక్షణమే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. శుక్రవారం బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో వరి, పసుపు, కంద, అరటి, తమలపాకు, కూరగాయల తోటలు, పత్తి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయన్నారు. ఉద్యానవన పంటలకు ఎకరాకు రూ.లక్ష, వరికి రూ.30వేలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వారం రోజులుగా పనులు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేదలకు ఆర్థిక సాయం చేయాలన్నారు. ముఖ్యంగా కౌలు రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. ఇటీవల వెదపద్ధతిలో వేసిన వరి పైరు వారం రోజుల నుండి నీటిలోనే మునిగి ఉందని తెలిపారు. పంట పెట్టుబడితోపాటు, కౌలు కూడా చెల్లించాల్సి ఉందన్నారు.

▶ 2లో

10న పంచాయతీల స్వయం సమృద్ధిపై సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

గ్రామ పంచాయతీల స్వయం సమృద్ధిపై ఈనెల 10వ తేదీన పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో నిర్వహిస్తున్న సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. శుక్రవారం బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో పంచాయతీలు నిధుల్లేక ఇబ్బంది పడుతున్నాయన్నారు. మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. ఈ క్రమంలో నూతన ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ చెబుతున్నారని గుర్తు చేశారు. రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్రం నుండి రావాల్సిన నిధుల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలో జరుగుతున్న సదస్సును జయప్రదం చేయాలని కోరారు.పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ నిధుల్లేక పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు సకాలంలో చెల్లించట్లేదని, నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయని చెప్పారు. సరిపడా కార్మికులను కూడా నియామకం జరగట్లేదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత

▶ 2లో

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కెఎస్ లక్ష్మణరావు, నాయకులు

బాధితుల కోసం పీకల్లోతు నీటిలో ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు..

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విజయవాడ నగరంలో వరద ఉధృతికి వేలాదిమంది నిరాశ్రయులైన నేపథ్యంలో బాధితుల కోసం చేపట్టిన సహాయ కార్యక్రమాల్లో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పల్నాడు జిల్లా నాయకులు చురుగ్గా పాల్గొంటున్నారు. సర్వం కోల్పోయిన విజయవాడ ప్రజల వద్దకు పీకల్లోతు వరద నీటిలోనూ వెళ్లి సాయం అందిస్తున్నారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కె.సాయికుమార్ నాయకులు అమూల్య, రోహిత్, గోవింద్, ప్రసాద్, యాసిన్ వరద బాధితులకు ఆహారం, నీళ్లు, బిస్కెట్స్ అందజేశారు. ప్రభుత్వం అందించే సహాయక కార్యక్రమాలు ప్రజలకు ఏమాత్రం సరిపోవడం లేదని, సర్వసం కోల్పోయి కట్టుబట్టలతో రోడ్లపై ప్రజలు నిల్చున్నారని ఆవేదన వెలిబుచ్చారు. యువత ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వరద బాధితులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

యుడైస్ ఆధారంగానే ప్రభుత్వాల నిర్ణయాలు

సమగ్ర శిక్ష అదనపు డైరెక్టర్ ఆర్ఎస్ గంగాభవాని

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థుల సమాచారాన్ని యుడైస్‌లో తప్పిదాలు లేకుండా నమోదు చేయాలని జిల్లా విద్యా శాఖ నోడల్ అధికారి-రాష్ట్ర ఎమ్‌డిఎం సమగ్ర శిక్ష అదనపు డైరెక్టర్ ఆర్ఎస్ గంగాభవాని అన్నారు. జిల్లా విద్యాశాఖపై నరసరావుపేట మండలంలోని శంకరభారతిపురం జెడ్‌పి పాఠశాలలో శుక్రవారం సమీక్షించారు. యుడైస్‌లో స్కూల్ ప్రొఫైల్, ఉపాధ్యాయుల సమాచారం, విద్యార్థుల ప్రొఫైల్‌లో కచ్చితమైన సమాచారం పొందుపరచాలని, ఈ సమాచారం ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకుంటాయని చెప్పారు. రాబోయే రోజుల్లో స్కూల్ కాంప్లెక్స్‌లపైనా సమీక్షిస్తామన్నారు. స్కూల్ కాంప్లెక్స్‌లన్నీ హైస్కూల్స్‌లోనే ఉండాలని, ఎక్కడైనా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలుంటే వాటిని హైస్కూల్స్‌కు మార్చాలని ఆదేశించారు. ఎంఇఒలు తరచుగా పాఠశాలలు సందర్శించి వివరాలు ఆన్లైన్‌లో పొందుపరచాలన్నారు. పని సర్దుబాటులో భాగంగా 483 మంది ఉపాధ్యాయులను అవసరం ఉన్న చోట్లకు మార్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప విద్యాశాఖ అధికారులు వేణు, ఏసుబాబు, ఎంఇఒలు, ప్రైవేటు పాఠశాలల సంఘ బాధ్యులు పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాలో 60 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - వినుకొండ

జాబ్ మేళాలల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు అన్నారు. స్థానిక పభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. 5 కంపెనీలు చేపట్టిన ఇంటర్వ్యూలకు 136 మంది హాజరయ్యారు. 60 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు సంజీవరావు తెలిపారు. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, డాక్టర్ కె. శ్రీనివాస రావు మాట్లాడుతూ జిల్లా అదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి రామాంజనేయులు, డిస్ట్రిక్ట్ ప్లేసెమెంట్ ఆఫీసర్ ఎం.రవీంద్ర నాయక్, వినుకొండ స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డి.జానీబాష, జె.సురేష్ పాల్గొన్నారు.

ముగిసిన ఎల్ఐసి వారోత్సవాలు

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో బీమా వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి బ్రాంచి సీనియర్ మేనేజర్ డి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు పలు పోటీ పరీక్షల నిర్వహించి బహుమతులను అందజేశారు. శాఖ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి, ఏజెంట్లకు క్విజ్ పోటీలు నిర్వహించారు. సీనియర్ బ్రాంచి మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విజేతలను అభినందించారు. క్విజ్ పోటీలో గుడ్ సఫర్డ్ స్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతి పొందగా, గీతాంజలి స్కూల్ విద్యార్థులు ద్వితీయ బహుమతి, బ్లూమ్స్ హైస్కూల్ విద్యార్థులు తృతీయ బహుమతులు సాధించారు. వ్యాసరచనలో ప్రథమ బహుమతిని బ్లూమ్స్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని ఎ.వర్షిత, ద్వితీయ బహుమతినిగ్లోబల్ మైండ్స్ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని జి.చాందిని, తృతీయ బహుమతిని గుడ్ షెఫర్డ్ స్కూల్ 7వ తరగతి విద్యార్థి ఎస్.యుద్దీష్‌రెడ్డి సాధించారు. చిత్రలేఖనం పోటీల్లో గ్లోబల్ మైండ్స్ పాఠశాల 5వ తరగతి విద్యార్థిని ఆర్.నాగరోహిణి సాహితి, గుడ్ షెఫర్డ్ స్కూల్ 4వ తరగతి విద్యార్థిని బి.లాస్యవర్షిణి, గ్లోబల్ మైండ్స్ పాఠశాల 4వవిద్యార్థిని రమీజా మొదటి మూడు స్థానాల్లో నిలవగా నీహారికకు కన్సోలేషన్ బహుమతుతిని అందించారు. కార్యక్రమంలో సి.గోపాలకృష్ణ, డివోలు ఎన్.బి వాసు, శ్రీనివాసరావు, ఏజెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- మాచర్ల

వినాయక చవితి మండపాలు ఏర్పాటు చేసేవారు నిబంధనలను కచ్చితంగా పాటించాలని మాచర్ల అర్బన్ సిఐ పి.ప్రభకర్‌రావు, రూరల్ సిఐ నఫీజ్‌బాషా కోరారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు విలేకర్లతో మాట్లాడుతూ మంటపాల వద్ద సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ అధికారుల నుండి అనుమతి పొందాకే మండపానికి విద్యుత్ సౌకర్యం పొందాలని చెప్పారు. విగ్రహప్రతిష్ట మండపము లోపల మరియు చుట్టుప్రక్కల అవసరమైన వెలుతురు వుండేటట్లు చూసుకోవాలని, విగ్రహప్రతిష్ట రోజు నుండి నిమజ్జనం జరుగు వరకు రాత్రి సమయములో మండపము వద్ద కనీసం ఒకరు కాపలాగా ఉండాలని అన్నారు. మండపాల దరిదాపుల్లో వాహనాలను పార్కింగ్ చెయ్యొద్దన్నారు. నిమజ్జన ఊరేగింపు సమయములో ఇతర మతస్తుల మనోభావాలను కించపరిచేలా, రెచ్చగొట్టే ప్రసంగాలు కానీ, రాజకీయంగా రెచ్చగొట్టే పాటలు గానీ పెట్టకుండా కార్యనిర్వహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాణసంచా కాల్చడం పూర్తిగా నిషేధమని, రాజకీయ నాయకుల ఫ్లెక్సిలకు అనుమతి లేదని తెలిపారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పునీత్ వెల్ఫేర్ సొసైటీ (పల్నాడు బ్లడ్ సెంటర్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమలను నరసరావుపేట ఎమ్మెల్యే కుమారుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య ముఖ్య అతిథిగా హాజరై నరసరావుపేటలోని గడియార స్తంభం సెంటర్లో పంపిణీ చేశారు. పర్యావరణానికి హాని చేయని మట్టి విగ్రహాలతో పండగ చేసుకోవాలన్నారు. పునీత్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ ఝాన్సీ రాణి, కార్యదర్శి జానకి రామయ్య మాట్లాడుతూ ఏడేళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేపట్టామని చెప్పారు.

పర్యావరణానికి హాని చేయని మట్టి వినాయకుని విగ్రహాలను భక్తులు పూజించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కుమారుడు డాక్టర్ ఆదిత్య అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని శ్రీనివాసనగర్ సాంబశివపేటలో గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలను డాక్టర్ ఆదిత్య పంపిణీ చేశారు. 16 ఏళ్లుగా గణేష్ ఫ్రెండ్స్ సారథ్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

ప్రజాశక్తి - వినుకొండ

గీతమ్స్ హైస్కూల్‌లో ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి హాజరై పండుగ నేపథ్యాన్ని వివరించారు.

నరసరావుపేటలో విగ్రహాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఆదిత్య

ప్రజాశక్తి - చిలకలూరిపేట

స్థానిక మోడరన్ స్టెల్లార్ పాఠశాలలో శుక్రవారం పర్యావరణానికి హాని కలగని పదార్థాలతో వినాయక ప్రతిమలను తయారు చేశారు. డైరెక్టర్ చేబ్రోలు మహేష్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లోని సృజనకు పదును పెడుతున్నట్లు చెప్పారు. దీంతోపాటు పర్యావరణంపై వారికి అవగాహనా పెరుగుతుందన్నారు. పట్టణంలోని రజక కాలనీ ఎంపిఎల్ పాఠశాలలో 150 మందికి ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షులు గట్టు సరోజిని ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. క్లబ్ కార్యదర్శి ఎన్.జయలక్ష్మి, ఇందిరా, నాగరాజకుమారి, అనంతలక్ష్మి, పి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రహదారులు ఛిన్నాభిన్నం

(మొదటి పేజీ తరువాయి)

విస్తరణకు నోచుకోని తుళ్లూరు నుంచి గుంటూరు, తుళ్లూరు నుంచి పర్యాటక కేంద్రం అమరావతి-సత్తెనపల్లి, కంతేరు-అడ్డరోడ్డు నుంచి తాడికొండ వరకూ రహదారులను విస్తరించడం ద్వారా రాజధాని ప్రాంతానికి జాతీయ రహదారి 65తో అనుసంధానం చేయవచ్చునని ఆర్అండ్‌బి శాఖ ప్రతిపాదించింది.

జిల్లాలో పెరిగిన ట్రాఫిక్ దృష్ట్యా ప్రధాన రహదారుల విస్తరణ పనులు కూడా ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. గుంటూరు-తెనాలి, గుంటూరు-రేపల్లె-వయా పొన్నూరు, గుంటూరు-పర్చూరు, సత్తెనపల్లి-అమరావతి, రేపల్లే-తెనాలి తదితర రహదారులను కూడా అభివృద్ధి చేయాలని అధికారులు ప్రతిపాదించారు. గత శనివారం దాదాపు నెల రోజుల్లో కురవాల్సిన వర్షం కేవలం రెండు మూడు గంటల్లోనే కురిసింది. గుంటూరు, పెదకాకాని, తాడికొండ, చేబ్రోలు, తుళ్లూరు, మంగళగిరి , తెనాలి , తాడేపల్లి, దుగ్గిరాలలో కురిసిన వర్షంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వాగులు, వంకలు, కాల్వలు పొంగి ప్రవహించాయి. దాదాపు రెండు రోజులు నీటిలోనే రోడ్లు అన్ని తేలియాడాయి. జాతీయ రహదారిపైన కూడా వరద తీవ్రంగా రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రభావం గ్రామీణ రహదారులపై ఎక్కువగా ఉంది. పలు చప్టాలు కూడా దెబ్బతిన్నాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కోసుకుపోయాయి. వరద ఎక్కువ సేపు నిలబడి పోవడంతో తారు రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. రహదారులు దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మంగళగిరి నుంచి తాడికొండ రావాలంటే కంతేరు రోడ్డు దెబ్బతినడం వల్ల గుంటూరు మీదుగా రెండు బస్సులు మారి వస్తున్నారు. రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో ఇప్పటికీ రాకపోకలు పునరుద్ధరించలేదు. అనివార్యంగా వెళ్లాల్సి వస్తే వాహనదారులకు ఫీట్లు తప్పడం లేదు.

ముంపు సమస్యను పరిష్కరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. తొలుత అన్నవరపు లంక, కొత్తూరులంక గ్రామాల్లో వరద ప్రభావంతో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. అన్నవరపు లంక, అన్నవరం వరకు 2.5 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మిస్తే లంక గ్రామాలు భద్రంగా ఉంటాయని రైతులు మంత్రి దృష్టికి తెచ్చారు. నీటిలో ఉన్న మొక్కలు దెబ్బతింటాయని, ఇదే వరద కొనసాగితే తమ గ్రామం మునిగిపోయే ప్రమాదం ఉందని కొత్తూరు లంక వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు. ప్రతి ఐదేళ్లకోసారి వరదలు రావడంతో తీవ్రంగా నష్టపోతున్నామని వివరించారు. ఎక్కువ మంది కౌలుకు భూములు తీసుకుని సాగు చేసుకుంటున్నామని, తీవ్రంగా నష్టపోయామని వివరించారు. కౌలు రైతులనూ ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన : బుర్రిపాలెంలో వరద బాధితులకు పెమ్మసాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా సుమారు రూ.10 లక్షల చేసే నిత్యావసరాలు పంపిణీ చేశారు. కాగా ప్రస్తుత పర్యటనలో బుర్రిపాలెం శివారు ప్రాంతాల్లో వరద కారణంగా ఇళ్లు నీట మునిగాయని, ఆదుకోవాలని మంత్రిని స్థానిక మహిళలు కోరారు. స్పందించిన మంత్రి స్థానిక నాయకులతో కలిసి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. ఆ ఇళ్ల నిర్మాణాలకు అధికారులతో కలిసి ప్రణాళిక రూపొందిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. నష్టపరిహారం అందిస్తామన్నారు. ఈ ప్రాంత సమస్యలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ దృష్టికి తీసుకెళ్లామని, వరద ప్రభావంతో జరిగిన నష్టాన్ని నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటున్నామని, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని ఈ సందర్భంగా మీడియాకు మంత్రి చంద్రశేఖర్ చెప్పారు.

వరద బాధితులకు పరిహారం ఇవ్వాలి : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

కృష్ణానదికి వరదలు రావడంతో మంగళగిరి మండలం, తాడేపల్లి రూరల్ మండలం, దుగ్గిరాల, కొల్లిపర, తుళ్ళూరు మండలాల్లో లంకభూములు, నదీపరివాహక ప్రాంతాలల్లోని భూములన్నీ నీటమునిగాయన్నారు. జిల్లాలో అన్ని పట్టణాలు, గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని, తాడేపల్లి సుందరయ్య నగర్‌లో కరకట్ట లోపలి వైపు వున్న 3 వేల ఇళ్లు మునిగిపోయాయని చెప్పారు. జిల్లాలో అనేక చెరువులు, పంట కాల్వలకు గండ్లు పడ్డాయని, నీరంతా పొలాలపై నుండి ప్రవహించిందని అన్నారు. అధిక వర్షాల వల్ల వందల కిలోమీటర్లు రోడ్లు ధ్వంసం అయ్యాయన్నారు. వెంటనే రోడ్ల మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం, ముందు చూపు లోపించడం వల్ల నష్టం ఎక్కువ జరిగిందని, జిల్లాలో ప్రధాన పంట కాల్వలు కొండవీటివాగు, గుంటూరు ఛానల్, నల్లమడవాగు వంటి కాల్వల్లో తూటుకాడ, గుర్రపుడెక్క పేరుకుపోయిందని, నీటి పారుదల శాఖ పట్టించుకోనందునే చిన్న వర్షం వచ్చినా కాల్వలు పొంగి ప్రవహిస్తున్నాయని అన్నారు. నీటిపారుదల శాఖ పర్యవేక్షణ సక్రమంగా లేదని, జిల్లాలో 200 మంది లస్కర్లు అవసరం కాగా, 60 మంది మాత్రమే వున్నారన్నారు. నీటి పారుదల శాఖలో ఖాళీగా వున్న ఇంజనీర్ పోస్టులు భర్తీ చేయలేకపోవడం వల్ల పర్యవేక్షణ లోపం జరుగుతోందని చెప్పారు. వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లించడం, మంచినీటిని క్లోరినేషన్ చేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. రైతు సేవా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన విధంగా ఎకరాకు పెట్టుబడి సహాయం రూ.20 వేలు ఈ సమయంలో మంజూరు చేయాలని, ప్రతి కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజి, ఈమని అప్పారావు, కె.నళీకాంత్, జిల్లా నాయకులు బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

10న పంచాయతీల స్వయం సమృద్ధిపై సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

కరువైందన్నారు. సదస్సులో పంచాయతీల అభివృద్ధి, కార్మికుల సమస్యలపై సమగ్రంగా చర్చించనున్నట్లు చెప్పారు. సదస్సులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, బి.రామాంజనేయులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం నాయకులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ, నాయకులు సిహెచ్.శ్రీనివాస్, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

పెదకాకానిలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సమావేశం పి.ఆదిలక్ష్మి అధ్యక్షతన జరిగింది. సిఐటియు జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజి మాట్లాడుతూ రాష్ట్ర సదస్సు జయప్రదానికి పిలుపునిచ్చారు. కార్మికులకు ప్రతినెలా జీతాలు ఇవ్వడం లేదని, సబ్బులు, నూనె, యూనిఫామ్ గుర్తింపు కార్డులు, మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని కోరారు. టెండర్ ప్రతిపాదన కొన్ని పంచాయతీల్లో ఇప్పటికీ పంపించలేదని వెంటనే టెండర్ ప్రతిపాదనలు పంపి ఆర్డర్ కాపీ తెప్పించి బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఈ అన్ని సమస్యలపైనా సదస్సులో చర్చించనున్నట్లు చెప్పారు.

పెదకాకాని సమావేశంలో మాట్లాడుతున్న శివాజి

చోరీలకు పాల్పడే ముగ్గురు అరెస్టు

ఎనిమిది మోటారు సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక ఎఎంజి వద్ద శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు మోటారు సైకిళ్లు చోరీ చేసి విక్రయిస్తున్నారని తెలిసింది. వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో సిఐ రమేష్ మీడియాతో వివరాలు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఉదయం ఐదు గంటల సమయంలో చిలకలూరిపేట పట్ట ణంలోని ఏ.ఎం.జి. వద్ద గల చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేస్తున్నామని పట్టణ మరియు పరిసర ప్రాంతాల్లో మోటార్ సైకిల్ దొంగ తనాలు చేసే చిలకలూరిపేటకు చెందిన కత్తి శివ, తన్నీరు ఉమా శంకర్ పెదనంది పాడుకు చెందిన ఒంటి పులి నరేంద్ర బాబు అనే ముగ్గురిని ఎస్సై డి.చెన్నకేశవులు మరియు సిబ్బందితో కలిసి అరెస్టు చేసి వారి వద్ద నుం చి ఎనిమిది మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ముగ్గురు కలసి గుంటూరులోని బ్రాడీపేట, యడ్లపాడు గ్రామంలోని శ్రీనివాస హోటల్ ముందు, చిలకలూరిపేట మండలం బొప్పూడి ఆంజనేయస్వామి గుడి వద్ద గల అమృత డాబా వద్ద, పురుషోత్తపట్నం అడ్డరోడ్డులోని కళ్యాణ్ హోటల్ లో, చిలకలూరిపేట లో గల కూరగాయల మార్కెట్లో, కొమ్మినేని వీరశంకర హాస్పిటల్ వద్ద తదితర ప్రాంతాల్లో మారు తాళాలతో మోటారు సైకిలు దొంగతం చేసేవారన్నారు. దొంగతనం చేసిన మోటార్ సైకిల్ ను చిలకలూరిపేట లో గల వేలూరు రోడ్డు నుండి రూట్ కాలనీకు వెళ్లే దారి మధ్యలో ఉన్న ముళ్లపొదుల్లో పెట్టి వాటిలో ఒక మూడు బైకులను శుక్రవారం ఉదయం అమ్ముదామని వెళుతుండగా వాహన తనిఖీలలో దొరికిపోయారన్నారు. అనంతరం వారి వద్ద నుంచి మొత్తం ఎనిమిది మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసు కున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - నకరికల్లు

ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీ కొట్టడంతో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నకరికల్లు గ్రామానికి చెందిన కండ్లగుంట వెంకటేష్(23) దేచవరం అడ్డరోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో వారిని చికిత్స కోసం నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మృతుని తండ్రి మణికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

ప్రజాశక్తి-ఈపూరు

మండలంలోని ఎ ముప్పాళ్ళ గ్రామంలో ఎండియు వాహనంలో ఓ ఇంటికి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వీఆర్వో షేక్ నబి అక్కడికి వెళ్లి పరిశీలించగా 36 బస్తాలు రేషన్ బియ్యం అక్రమ నిల్వలను గుర్తించారు. ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు అక్కడ చేరుకొని ఎండియూ ఆపరేటర్ ముప్పాళ్ళ వినాథన్ ను విచారించగా రేషన్ బియ్యం డీలర్ కొరముట్ల శ్రీనివాసరావుకు చెందినవిగా తెలపటంతో రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉమామహేశ్వర రావు తెలిపారు.

దోమల నియంత్రణకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలలో భాగంగా దోమల నియంత్రణకు కార్యాచరణ చేపట్టినట్లు చైర్పర్సన్ తాడిపోయిన రాధిక చెప్పారు. స్థానిక 10 వ వార్డు అనుగోలువారివీధి, బొంతరామయ్య కాలనీలలో దోమల నియంత్రణలో భాగంగా నిల్వ నీటిపై ఆయిల్ బాల్స్ చల్లించటం, కల్వర్టు ఫాగింగ్ కార్యక్రమాన్ని చైర్పర్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులు మలేరియా, డెంగీ, చికెన్ గునియా, బోదకాలు, మెదడువాపు వ్యాధులు వ్యాప్తి చెంద కుండా ఉంటాయని దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ చెల్లించటం, ఫాగింగ్ వంటి చర్యలు జరుగుతున్నాయన్నారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ ఉదయం సమయంలో కల్వర్టు ఫాగింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తద్వారా దోమల నియంత్రణకు అవకాశం కలుగుతుందన్నారు. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె హెలెన్ నిర్మల మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో ఎక్కడా నీటి నిలువలు లేకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ఎ.రామచంద్రరావు, సిబ్బంది లక్ష్మీ, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్ ఉమాకాంత్ , డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అశ్లీల నృత్యాలకు అనుమతి లేదు : సిఐ

ప్రజాశక్తి -తాడికొండ

చవితి మండపాల నిర్వాహకులకు తాడికొండ సిఐ కే వాసు శుక్రవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ మండపాల వద్ద ఎటువంటి గొడవలు జరుగకుండా చూడవలసిన బాధ్యత నిర్వాహకులదే అన్నారు. అశ్లీల నృత్యాల చట్టరీత్యా నేరమని, దానికి నిర్వాహకులే శిక్షకి పాత్రులు అవుతారని అన్నారు. పర్మిషన్ లెటర్ ను మండపాల వద్ద ప్రదర్శించాలని అన్నారు. ఊరేగింపు సమయంలో టపాకాయలు పేల్చవద్దని, ఎటువంటి అవాంఛనీయ ఘట నలు జరగకుండా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహిం చుకోవాలని తెలియజేసినారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది నిర్వాహకులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

సాగర్ కాల్వలో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఈపూరు

నాగార్జునసాగర్ కుడి ప్రధాన కాలువలో వ్యక్తి జారిపడి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇనిమెళ్ల గ్రామంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కాసా రామకోటయ్య (62) గ్రామ సమీపంలోని పొలం వద్దకు వెళ్లి పనులు ముగించుకొని అనంతరం కాలువ వద్దకు బహిర్భూమికి వెళ్లి కాలుజారి కాలువలో పడటంతో గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు గాలించగా ఈపూరు గ్రామ సమీపంలో కాలువలో రామకోటయ్య మృతదేహం లభ్యమైంది. మృతుని కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు.

నీటమునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి సాయిబాబా గుడి సమీపంలో సుమారు వంద ఎకరాల్లో పంట పొలాలు ఇంకా నీటిలోనే నానుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు వాపోతున్నారు. పంట పొలాల్లో నుంచి నీరు పోవాల్సిన తూములు ఎక్కడికక్కడ మూసుకుపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని రైతులు బావురుమంటున్నారు. ఐదు రోజుల నుంచి పంట పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేస్తే సమాధానం లేదని వాపోయారు. కాలువల్లో పూడిక సరిగ్గా తీయకపోవడమే ఇందుకు కారణమని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తాగునీరు, బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

తెలుగు యువత గుంటూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్, లింగంశెట్టి అసోసియేట్స్ అధినేత లింగంశెట్టి కిషోర్‌కుమార్ దాతల సహకారంతో విజయవాడ వరద బాధితులకు 500 వాటర్ టిన్నులు, 500 వాటర్ బ్యాగులు, 5 వేల బిస్కెట్ ప్యాకెట్లు సింగ్‌నగర్, వాంబేకాలనీ, సితార సెంటర్లలో పంపిణీ చేశారు. ఉండవల్లి నుంచి ట్రాక్టర్ల ద్వారా వీటిని తరలించినట్లు వారు చెప్పారు.

కుంచనపల్లిలో 80 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్ , పెన్నులు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామ జనసేన పార్టీ ఆధ్వర్యంలో , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం కుంచనపల్లి పరిధిలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో 80 మంది విద్యార్థులకు ముఖ్యఅతిథిగా తాడేపల్లి మండల టిడిపి అధ్యక్షులు అమరా సుబ్బారావు నోట్ బుక్స్, పెన్స్ పంపిణీ చేశారు. పాఠశాలలో వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడం వలన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఉపాధ్యాయులు నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన టిడిపి, జనసేన నాయకులు వాటర్ ప్లాంట్ ను, కొత్త వాటర్ ఫిల్టర్ ని ఏర్పాటు చేశారు. అనంతరం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా స్కూల్లోని ఉపాధ్యాయులకు పెన్స్‌ను బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమం కుంచనపల్లి గ్రామ టీడీపీ, జనసేన పార్టీ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, మేకల రాజా,శేషంశెట్టి శ్రీనివాసరావు, గడ్డం మురళి కృష్ణ, తోటకూర ప్రవీణ్, ఉప్పె వెంకయ్య, బొడ్డు మహీంద్ర, మేకల వాసు, కొవ్వూరి సురేష్,, ఎనుముల శివరామకష్ణ, అమ్మిశెట్టి హేమంత్, పుష్పాల వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

చాకలికుంట తండాలో కోతుల స్వైరవిహారం

మహిళ పై దాడి - భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలో చాకలి కుంట తండా గ్రామంలో గత కొద్ది రోజులు గా కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. కోతులు గుంపులు గుంపులుగా వచ్చి ఇళ్ళల్లోకి చొరబడి వస్తువులను పాడు చేస్తున్నాయని తోలపోతుంటే ఎగబడి దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులు చెట్లు కొమ్మల మీద, ఇంటిగోడలపై గుంపులుగా వచ్చి ఉంటున్నాయని ఇళ్ళల్లో పనులు చేసుకోలేక పోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. అంటున్నారు.ఆకలికి తాళలేక మహిళలపై చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో కోతలు బెడద లేకుండా చేయాలని కోరుతున్నారు.

లింక్ డాక్యుమెంట్లు పోయినవి

పల్నాడు జిల్లా, నరసరావుపేట పట్టణంలోని క్రిస్టియన్ పాలెం నివాసి అయిన డోర్ నెంబర్ 17- 4 -22, కుందా సత్యవతి w/o రాజేష్ యావన్మందికి తెలియజేయునది ఏమనగా కేసనపల్లి గ్రామ పరిధిలో గల భావన నగర్, ఫ్లాట్ నెంబర్ 12 కాళీ స్థలం లింక్ డాక్యుమెంట్ లు No.9791/2014, 9780/2014 గల 13-8-2024 తేదిన కేసనపల్లి నుండి బైక్ మీద బైపాస్ రోడ్డు దగ్గర జిరాక్స్ నిమిత్తం రాగా కనపడకుండా పోయినాయి. ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్ కి తెలియజేయగలరు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, మంగళగిరి మునిసిపల్, పాతమంగళగిరి, 9వ వార్డు డోర్ నెం. 9-260, 261రు కాపురస్తుడు అయిఉండి, ప్రస్తుత వృత్తి రీత్యా నంబూరు గ్రామ కాపురస్తుడనైన సయ్యద్ జానీ సాహెబ్ గారి కుమారుడు సయ్యద్ చాంద్ బాషా గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది: నా క్లయింటు మంగళగిరి S.R.Oలో ద.నెం. 2776/2008రుగా విక్రయ రిజిష్టర్ పొందిన గుంటూరు జిల్లా, మంగళగిరి రెవిన్యూ గ్రామం తాలూకు సర్వే నెం.99రు, మంగళగిరి మునిసిపల్ డోర్ నెం. 9-260, 9-261రు నందు చ॥ గ॥ 67లు ఆస్తికి శ్రీ మంగళగిరి సబురిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, 594వ వాల్యూం, 314ల 316 పుటలలో నెం.808/1977 రుగా లింకు దస్తావేజు అయి ఉన్నది ది.02.08.2024న నా క్లయింటు ఇంటి నుండి తాడికొండ సబ్-రిజిస్ట్రారు ఆఫీసుకు వస్తూఉండగా మార్గమధ్యంలో సదరు ఒరిజినల్ దస్తావేజు 808/1977 పోయినది. ఎంత వెదికినా, దారిలో విచారించినా ఈ రోజు వరకు దొరకలేదు. కావున పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు ఎవరికైననూ దొరికిన యెడల దిగువ అడ్రసుకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాను. అటులగాక సదరు దస్తావేజు ద్వారా ఎటువంటి లావాదేవీలు జరిపిన గాని అవి అన్నియు నా క్లయింటును బైండు చేయజాలవని యిందుమూలముగా తెలియజేయడమైనది

మంగళగిరి,

తేది : 06-09-2024 ఇట్లు

బేతపూడి నాయుడమ్మ, న్యాయవాది,
డోర్ నెం. 1-516/ఎ, కొత్తపేట,
మంగళగిరి పట్టణం, గుంటూరు జిల్లా.
సెల్ నెం : 9394322229

నోటీసు

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
హెచ్.యం.ఓ.పి.నెం.43/2024

బిట్వీన్:
పిచ్చపాటి రత్నభూపాల్ రెడ్డి, తండ్రి వెంకటరెడ్డి ..... పిటీషనరు
మరియు
పిచ్చపాటి కల్పనా దేవి ..... రెస్పాండెంటు

టు,
పిచ్చపాటి కల్పనా దేవి, W/o. రత్నభూపాల్ రెడ్డి, D/o నంద్యాల సత్య నారాయణ రెడ్డి, ప్రస్తుత నివాసం.డోర్ నెం.9-9-7, అరండల్ పేట, Samsung షోరూమ్ ఎదురు, నరసరావుపేట, ప్రస్తుతం పల్నాడు జిల్లా.

పై నెంబరు ఓ.పి.లోని పిటీషనరు,తనకు రెస్పాండెంటుతో జరిగిన వివాహమును రద్దు పరిచి విడాకులు ఇప్పించమని కోరుచూ దాఖలు చేసిన పిటీషన్ లో రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని ది:24-09-2024 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ తరపు ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:24-09-2024

Chaanukya's "Fight for Right"

శ్రీనివాసరావు.జి.సిహెచ్.,
పిటీషనరు తరపు న్యాయవాది,
పట్టాభిపురం, గుంటూరు.

Notice
IN THE COURT OF THE HON'BLE PRL.CIVIL JUDGE(SENIOR DIVISION):: BAPATLA
I.P.No: 11/ 2016

Between:
Mirza Mohammad Saleem ... Petitioner
And
G.Mithravardhan Reddy & Others ... Respondents

To,
R-13: Shaik Moulali,S/o.Not known, Back Side of 60 Feet Road, Rishi Velly Apartment, Srinivasarao Pet, Guntur Town and Dt.
R-20: M.M.Khuddus,S/o. Azeemuddin, teacher, Saida Street, Chandole(Vil), Pittalavanipalem(Md), Guntur Dt., Presently Bapatla Dist.,

పై నెంబరు I.P లోని పిటీషనరు,తనను ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్ చేయమని దాఖలు చేసిన పిటీషనులో 13 & 20 వ రెస్పాండెంట్లు అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:01-10-2024 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరుగారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:01-10-2024

S.B.TAJUDDIN ,
పిటీషనర్ తరపు అడ్వకేట్,
గుంటూరు, సెల్: 98483 55279.

మహారాజశ్రీ గౌరవ ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి గారి కోర్టు నందు
ఇ.ఎ. 1/23 ఇన్ ఇ.పి. 7/2021

బిట్వీన్:
తిరుమల కమిషన్ మర్చంట్, రిప్ బై ఇట్స్ ప్రొ॥ ఎన్.సామ్రాజ్యలక్ష్మి .... పిటీషనర్ / డిహెచ్‌ఆర్
మరియు
ఎం.కస్తూరి @ కోడూరి వీర కస్తూరి అండ్ అనదర్ .... రెస్పాండెంట్స్ / జెడిఆర్స్

టు,
ప్రతివాది / జెడిఆర్స్ / రెస్పాండెంట్స్
1) ఎం.కస్తూరి @ కోడూరి వీర కస్తూరి W/o లేటు బలదేవ కుమార్
2) ఎం.నితిషా D/o లేటు బలదేవ కుమార్
Both are R/o H.No. 8-114, చైతన్యగోదావరి బ్యాంకు దగ్గర, దుగ్గిరాల గ్రామం, పోస్టు, గుంటూరుజిల్లా,

పైన తెలిపిన డిహెచ్‌ఆర్ ఇ.పి. 7/2021 ను పైన తెలిపిన కోర్టులో వేసినారు. వారు ఎన్నిసార్లు నోటీసు పంపినను మీరు తీసుకోనందున వాయిదా వేసినారు. కావున మీరు ది. 26-9-2024నాడు ఉదయం 10-30 గం.లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట మీరు స్వయంగా గానీ, లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(కోర్టు వారి అనుమతితో)

ఎన్.వెంకటేశ్వరరావు,
అడ్వకేట్, తిరువూరు

మహారాజశ్రీ గురజాల సివిల్‌జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ. నెం. 953/2015 ఐ.ఎ. నెం. 954/2015, ఓ.యస్. నెం. 23/2010

పిటీషనర్ : సూరె మణికాంత్
వర్సెస్
రెస్పాండెంట్లు : సూరె శ్రీనివాసరావు వగైరా
ఆర్2 : సూరె వెంకట నాగేశ్వరరావు తండ్రి : మస్తానయ్య, ఆదర్తి టవర్స్, ఫ్లాట్ నెం. 2/1, ఎన్‌టిఆర్ స్టేడియం వెనుక, 3వ లైను, లక్ష్మీపురం, గుంటూరు.
ఆర్3 : బొబ్బూరి చిన శౌరమ్మ, భర్త : వేణు, ఫ్లాట్ నెం. 1, అన్నపరెడ్డి అపార్ట్‌మెంట్స్, ఆంజనేయ పేట, కొరిటెపాడు, గుంటూరు.

పై నెంబరులో కోర్టువారు ది. 3-11-2014న జారీ చేసిన పార్టీషన్ డిక్రీ ప్రకారం కమీషనర్‌ను నియమించి విభాగములు నిర్ణయించుటకున్ను, దరిమిలా ఫైనల్ డిక్రీ ఇప్పించుటకున్నూ కోరుచూ పై పిటీషన్లు దాఖలు చేసియున్నందున ఆర్2 మరియు ఆర్3లకు నోటీసు నిమిత్తం ది. 17-9-2024న శ్రీ కోర్టువారు వాయిదా వేసియున్నారు. కావున సదరు తేదీన ఆర్2 మరియు ఆర్3 రెస్పాండెంట్లు ది. 17-9-2024న పై వారి కోర్టులో ఉదయం 10-30 గం.ల నుండి హాజరులో వుండి తనమ ఆక్షేపణలు తెలుపుకొన వలసివుండును. లేనియెడల పరోక్షమందు తీర్మానించబడును. కావున తెలియపర్చుడమైనది.

వాయిదా : 17-9-2024
ఎం.లక్ష్మీ నాగారపమ్మ, బి.కాం., బి.ఎల్.,
అద్వకేటు, గురజాల.
సెల్ నెం : 98850 35446

ఇసుక స్టాక్ యార్డులు ఖాళీ

- ఇసుక కొరతతో ఉపాధికి కోత
- రంగంలోకి అక్రమార్కులు
- అధిక ధరలకు విక్రయం

రాజుపాలెం మండలం కొండమోడు స్టాక్ యార్డు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పల్నాడు జిల్లాను ఇసుక కొరత వెంటాడుతోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఏ ఒక్క స్టాక్ యార్డులోనూ ఇసుక లభ్యం కాకపోవడంతో నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. లక్షలాది మంది కార్మికులు పనుల్లేక భారంగా బతుకు సాగిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ తెచ్చిన రెండు నెలల వ్యవధిలోనే ఇసుక కొరత రావడంతో నూతనంగా ఏర్పాటు చేసిన ఇసుక విధానంతో ప్రజలకు ఏమాత్రం లబ్ధి చేకూరడంలేదని వాపోతున్నారు.

గత ప్రభుత్వంలో పల్నాడు జిల్లాలో వైకుంఠపురం, కోనూరు, మాదిపాడు, వినుకొండ, కొండమోడు తదితర ప్రాంతాల్లో ఇసుక స్టాక్ యార్డులు నందు 2,39,900 మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వలు ఉన్నాయని, ప్రభుత్వం ఆ స్టాక్ యార్డుల నుండి ప్రజలు ఆన్‌లైన్ విధానంలో లోడింగ్ చార్జీలు చెల్లించి ఇసుకను తీసుకెళ్లొచ్చని ప్రకటించారు. రెండు నెలల వ్యవధిలోనే రాజుపాలెం మండలంలోని కొండమోడు, వినుకొండలోని స్టాక్ యార్డుల్లో ఇసుక అయిపోయింది. కొండమోడు స్టాక్ యార్డు నందు నిల్వ ఉంచిన ఇసుకను ప్రభుత్వం మారగానే కొందరు అక్రమార్కులు ఇష్టరీతిగా వందలాది టన్నులు అక్రమంగా తరలించుకున్నారు. కోనూరు, మాదిపాడు, వైకుంఠపురం స్టాక్ యార్డుల్లో ఇసుక నిల్వలు కూడ తగ్గాయని, ప్రస్తుతం కృష్ణా నది నుండి వరద వస్తుండటం, స్టాక్ యార్డులు నదికి దగ్గరగా ఉండటంతో 20 రోజల నుండి ఇసుక సరఫరాను అధికారులు నిలిపేసినట్లు స్థానికులు చెబుతున్నారు. నదికి అనుకొని ఉన్న స్టాక్ యార్డుల్లో మిగిలిన ఇసుక నిల్వలు వరద ప్రవాహానికి కొట్టుకొని పోయి ఉంటుదని స్థానికులు అంటున్నారు. వరద తగ్గేంతవరకు ఇసుక సరఫరాలు ఉండవని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో దళారుల నుండి అధిక మెత్తంలో వెచ్చించి ఇసుకను కొనుగోలు చేయిల్సి వస్తుందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఇసుక పాలసీ వల్ల పనులు లేక ఇబ్బందులు పడ్డామని, ప్రభుత్వం మారినా ఇసుక కష్టాలు తప్పడంలేదని వాపోతున్నారు.

ఇదే అదునుగా దళారులు దందా

ఇసుక అందుబాటులో లేకపోవడంతో దళారులు దందాలు మెదలు పెట్టారు. మాచర్ల పట్టణానికి ఇసుక సరఫరా చేయాలంటే టన్నుకు రూ.1600 పైగా వసూలు చేస్తున్నారు. గతేడాదిలో రూ.వెయ్యికే దక్కేది. పిడుగురాళ్లలో టన్ను ఇసుక గతంలో రూ.750-850 తీసుకోగా ఇప్పుడు రూ.1400కు పైగా వసూలు చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ఇసుకను నిల్వ ఉంచి చాటుగా అమ్ముతున్నారు. స్టాక్ యార్డులలో నిల్వ చేసిన ఇసుకను అనధికారకంగా ఆన్‌లైన్ చేసుకొని రహస్య ప్రదేశాలకు ఇసుకను కొందరు దళారులు తరలించారు. ప్రస్తుతం ఇసుక కొరత రావడంతో అదే ఇసుకను అధిక ధరలకు అమ్ముకుంటున్నారు.

చెస్‌లో తెలుగు తేజం అజయ్ సంతోష్ మెరుపులు

ప్రజాశక్తి - రెంటచింతల

అంతర్జాతీయ చెస్ పోటీల్లో రెంటచింతలకు చెందిన పి.అజయ్ సంతోష్ మెరిసి భారత కీర్తి ప్రతిష్టలను దశ దిశలా వ్యాపింపజేశారు. శ్రీలంకలోని కలుతర నగరంలో ఈనెల 5న నిర్వహించిన పోటీల్లో అండర్-18 విభాగంలో బంగారు పతకం సాధించారు. 7 పాయింట్లకు గాను 6.5 పాయింట్లతో శ్రీలంకకు చెందిన ఎ.ఎ.కనిష్క గిరిషన్ లక్షరి మీద గెలిచినట్లు చెస్ మేనేజర్ లుక్స్ మాన్ విజయ్ సూర్య తెలిపారు. గత నెల అబుదాబిలో నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచారని, ఈ సంవత్సరం అక్టోబర్ 28 నుంచి నవంబర్ 10 వరకు బ్రెజిల్ లోజరిగే వరల్డ్ యూత్ చెస్ చాంపియన్‌కు ఎంపికయ్యారని తెలిపారు. అజయ్ సంతోష్ ఢిల్లీ సమీపంలోనే నోయిడాలోని రామాగ్య ఇంటర్నేషనల్ స్కూల్లో 9వ తరగతి చదువుతుండగా తండ్రి వెంకట మయూర్ అక్కడే సివిల్ కాంట్రాక్ట్‌గా పని చేస్తున్నారు.

ఆక్రమణల తొలగింపునకు హద్దులు

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోని మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు ఈనెల 20వ తేదీ కల్లా తొలగించకుంటే ప్రభుత్వమే తొలగింపు పనులను చేపడుతుందని తహశీల్దార్ జి.కరుణ కుమార్ తెలిపారు. శుక్రవారం ఆర్ఐ డి.కాంతారావు నేతృత్వంలో సర్వేయర్లు, పంచాయతీ సెక్రెటరీ కోటేశ్వరరావు తమ బృందంతో రహదారికి ఇరువైపులా రోవర్ ద్వారా కొలతలు వేసి హద్దులు నిర్ణయించారు. వైఆర్ఎస్ హైస్కూల్ నుండి పెట్రోల్ బంకు వరకు ఈ ఆక్రమణలు తొలగించి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు లింగయ్య, రేఖ, విగ్నేష్, సర్వేయర్లు అర్జున్ రామ్మోహన్రావు, రవీంద్రారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులే కీలకం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుని పాత్ర చాలా విలువైనదని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం రాత్రి ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ స్థానిక గోశాలకళ్యాణ మండపంలో వేడుకలు నిర్వహించగా కార్యక్రమానికి లయన్స్ అధ్యక్షులు పొన్నెకంటి.కిషోర్ కుమార్ అధ్యక్షత వహించారు. ప్రవీణ్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావం, సేవాతత్పరతతో పనిచేసిననాడు అదే బాటలో మంచి విద్యార్థులు తయారై దేశాభివృద్ధిలో తమవంతు పాత్రపోషించగలరని ఆశాభావం వ్యక్తంచేశారు. ఎంఇఒలు ఎ.శ్రీనివాసరావు, ఎ.రాఘవేంద్ర రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనలో వస్తున్న మార్పులకనుగుణంగా పనిచేయాలని, ఒక ఉపాధ్యాయుడు వృత్తిలో అలసత్వం వహిస్తే విద్యార్థులు ఎందరో తమ నైపుణ్యాలను సంఘానికి ఉపయోగించలేరని చెప్పారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించిన రెంటపాళ్ల పాఠశాల హెచ్ఎం జి.బసవరాజు, చంద్రాజుపాలెం పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్.భానుమూర్తి, దూళ్లిపాళ్ల పాఠశాల ఉపాధ్యాయులు బి.రమేష్‌బాబు, పాకాలపాడు పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్.అగస్టస్‌బాబు, శంకరభారతిపురం పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.సూరిబాబు, ఎన్.అనంతలక్ష్మీసత్యవతిని సత్కరించారు. లయన్స్ కార్యదర్శి బి.వీరాంజనేయులు, కోశాధికారి బి.రోశయ్య పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు ఇస్తున్న పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

చంద్రవంకలో ఆక్రమణలను తొలగించండి : కలెక్టర్

ప్రజాశక్తి- మాచర్ల

చంద్రవంక నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న ఆక్రమణలు, గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలను తొలగించాలని అధికారులను జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఇటీవల భారీ వర్షాలకు పొంగిపొర్లిన చంద్రవంక వాగును కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం పరిశీలించారు. మాచర్ల జమ్మలమడక రహదారిపై వున్న లో లెవల్ బ్రిడ్జి వద్దకు చేరుకొని వాగు ఎక్కడ నుంచి ఎక్కడికి పారుతుంది, వాగు పొంగి పొర్లటం వల్ల జరిగిన నష్టం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వాగు మ్యాపును పరిశీలించారు. వాగు ప్రవాహానికి ఆటకం కలగకుండా చూడాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా వుండాలని, వాగుకు ఇరువైపుల ఆక్రమణలు తొలగించాలని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పట్టణంలోని రామాలయం వీధిలోని సచివాలయాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎత్తిపోతల జలపాతాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, మాచర్ల తహశీల్దార్ జియాఉల్‌హక్, ఆర్ఐ నిమ్మల శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఏఈ హిమబిందు, సర్వేయర్ సాల్మన్‌రాజు, ఏఈ ఆదిత్య ఉన్నారు.

అధ్వాన పారిశుధ్యంపై జిల్లా వైద్యాధికారి ఆగ్రహం

ప్రజాశక్తి-ఈపూరు

డెంగీ జ్వరం లక్షణాలతో మండలంలోని బూడిదలకు చెందిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్రమంలో గ్రామాన్ని శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి సందర్శించారు. గ్రామంలో మురుగు కాల్వలు అధ్వానంగా ఉండటంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జ్వరాలు విద్యుంబిస్తున్న వేళ పంచాయతీ అధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. మురుగు కాల్వల్లో నీటి నిల్వలతో జ్వరాలు విజృంభిస్తాయని, ప్రజలు రోగాల బారిన పడతారని, ఇందుకు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. అనంతరం అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు, గర్భిణుకు, బాలింతలకు పోషకాహారం సేవలపై ఆరాతీశారు. పంక్చర్ షాప్ వద్ద టైర్లలో నిల్వ ఉన్న నీటిని సిబ్బందితో తొలగింపజేశారు. నీటి నిల్వలతో జరిగే అనర్థాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్, వినుకొండ డివిజన్ మలేరియా అధికారి సుబ్బారావు, కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డి.నాగేంద్రబాబు, ఎంపీహెచ్‌పిఓ సాంబశివరావు, ఎంఎల్‌హెచ్‌పి రమణ నాయక్, ఎంపీహెచ్ఏ శివకృష్ణ, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

విధుల నుండి తొలగింపుతో వీధిన పడ్డ పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - దాచేపల్లి

మండల కేంద్రమైన దాచేపల్లి పంచాయతీలో అకారణంగా విధుల నుండి నిలిపేసిన ఐదుగురు కార్మికులను వెంటనే విధుల్లో తీసుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు కమిషనర్ అప్పలనాయుడుకు నాయకులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ షీలార్ మసూద్ మాట్లాడుతూ 2014 నుంచి పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను ముందస్తు నోటీసులు లేకుండా ఆపడం అన్యాయమన్నారు. అధికారుల చర్యల వల్ల అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న వీరి కుటుంబాలు రోడ్డున పడతాయని చెప్పారు. దీంతోపాటు మున్సిపల్ కార్మికులకు రావాల్సిన యూనిఫామ్, సబ్బులు, చెప్పులు ఇవ్వాలని, పండగ సెలవులు, క్యాజువల్ లీవులు అమలు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయ కులు టి.శ్రీనివాసరావు, కార్మికులు వెంకటేశం, వి.జాను, సాంబయ్య, కోటేశ్వరమ్మ, యేసయ్య పాల్గొన్నారు.

వల్లెపు శ్రీనివాసరావుకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

ప్రజాశక్తి-ఈపూరు : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార వేడుకల్లో మండల కేంద్రం ఈపూరు ఏపీ మోడల్ స్కూల్, కళాశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు వల్లెపు శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. జిల్లా కలెక్టర్ బి.అరుణ్ బాబు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు నుండి ప్రశంసా పత్రంతోపాటు పురస్కారాన్ని అందుకున్నారు.

బాధితులకు అండగా ప్రభుత్వం

నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించిన మంత్రులు

ప్యాకింగ్ ను పరిశీలిస్తున్న మంత్రులు

ఆహార పదార్థాల ప్యాకింగ్ లో డ్వాక్రా మహిళలు

ప్రజాశక్తి - తెనాలి

ప్రకృథి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలకు ఉచిత నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె అచ్చం నాయుడు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశనేని శివనాథ్‌తో కలిసి మనోహర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కృష్ణా నది ఉగ్రరూపం దాల్చి, విజయవాడ నగరం, పరిసర ప్రాంతాలకు అపార నష్టం కలిగించిందన్నారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వపరంగా నిర్విరామంగా సహాయక చర్యలు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల్లో ధైర్యం, భరోసా నింపేందుకు ప్రభుత్వం తరపున ఉచితంగా నిత్యావసర సరుకులు అందజేసే కార్యక్రమం ప్రారంభించామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనల మేరకు పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ సంయుక్తంగా ఈ నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం తరపున విజయవాడ, పరిసర ప్రాంతాల్లోని వరద ముంపు బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, పంచదార, కందిపప్పు, వంటనూనె కేజీ చొప్పున, ఉల్లిపాయలు, బంగాళ దుంపలు సరఫరా చేయాలని నిర్ణయించాం. వీటితో పాటు మున్సిపల్ శాఖ నుంచి వచ్చిన మరికొన్ని నిత్యావసరాలను బాధితులకు అందిస్తున్నామన్నారు. 1100 రేషన్ పంపిణీ వాహనాల ద్వారా అనేక జిల్లాల నుంచి యంత్రాంగం కదిలి వచ్చి ఈ పంపిణీ కార్యక్రమం లో పాల్గొంటుందన్నారు. ప్రారంభించిన రోజునే 70 వేల మంది బాధితులకు ఉచిత నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వివిధ జిల్లాల నుంచి 400 లారీల్లో సరుకులు తెప్పించామని, రేషన్ కార్డు, ఆధార్ కార్డులు లేని వారికి కూడా మొబైల్ నంబర్, వివరాలు నమోదు చేసుకుని కిట్లు పంపిణీ చేయాలని ఆదేశించామని ఈ కార్యక్రమానికి కూటమి పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు సహకరించాలని కోరుతున్నామన్నారు. వినాయక చవితి పండుగ రోజు కూడా నిత్యావసరాల పంపిణీ కొనసాగుతుందన్నారు. విజయవాడ మార్కెట్ యార్డులో బాధితులకు పంపిణీ చేయాల్సిన సరుకుల ప్యాకింగ్ లో వివిధ ప్రాంతాలకు చెందిన డ్వాక్రా మహిళలు స్వచ్ఛందంగా పాల్గొని సేవలను అందించడం అభినందనీయమని మనోహర్ అన్నారు. కార్య క్రమంలో పౌరసరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి వీరపా ండ్యన్, ఆహార పౌరస రఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర :వరద బాధితులను ప్రభుత్వము ఆదుకుంటుందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు శుక్రవారం కొల్లిపర మండల వరద ముంపు గ్రామాలైన బొమ్మువానిపాలెం అన్నవరపు లంక కొత్తూరు లంక గ్రామాల్లో పర్యటించారు ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా గ్రామాల్లో శానిటేషన్ వైద్య శిబిరం ఏర్పాట్ల గురించి అధికారులన అడిగి తెలుసుకున్నారు వరదలు వలన కలిగిన నష్టం గురించి ఆయా గ్రామాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు అన్నవరపు లంక గ్రామంలోని రైతులు త్వరితగతిన పంట నష్టం నమోదు చేసి ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం ఇప్పించాలని కోరారు పక్కనే ఉన్న మండల వ్యవసాయ అధికారి కే వెంకటరావు తో ఆ విషయమై ఆమె చర్చించారు బొమ్ము వాని పాలెం కు చెందిన నక్క సంసోను తన ఇంటిలో నిల్వ ఉంచిన మొక్కజొన్నలు వరద నీటిలో మునిగి మొక్క మొలిచాయని ఆమె దృష్టికి తీసుకువచ్చాడు ప్రభుత్వము బాధితులను అన్ని విధాలుగా ఆదుకుం టుందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో కొల్లిపర మండల తాసిల్దార్ సిద్ధార్థ ఎంపీడీవో విజయలక్ష్మి ఆయా గ్రామాల వీఆర్వోలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

మూగజీవులకు ఎమ్మెల్యే నసీర్ పశుగ్రాసం పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

భారీ వర్షాలకు ప్రజలు భోజనం దొరకక ఇబ్బంది పడుతుంటే మూగజీవలకు సైతం మేత దొరకని పరిస్థితి నెలకొంది అని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ విజయవాడ 1వ డివిజన్‌లో 3వ రోజు పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా చుట్టుపక్క ప్రాంతాల్లో పర్యటించగా ప్రాంత ప్రజలు ఆవులు దూడలు సైతం ఆహారం దొరక్క అలమటించిపోతున్నాయని ప్రజలు వాపోయారు. ఎమ్మెల్యే నసీర్ మూగజీవాల కోసం తన సొంత ఖర్చుతో గుంటూరు నుండి లారీ గడ్డిని తెప్పించి రైతులకు పంపిణీ చేశారు. రైతులు ఎమ్మెల్యే నసీర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : ఇటీవల కురిసిన అధిక వర్షాలకు, ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామం లంక పొలాలన్నీ నీట మునగడంతో పశువులకు మేత ఇబ్బంది ఏర్పడింది. శుక్ర వారం యంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామంలో టిడిపి నాయకులు రైతులకు ఒక్కొక్కరికి 50 కేజీలు చొప్పున 75 టన్నుల పశువుల మేతను ఉచితంగా పంపిణీ చేశారు. కార్య క్రమంలో నాయకులు వీరిశెట్టి శ్రీనివాసరావు, తాడేపల్లి మండలం పశు వైద్యాధికారి నరేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ వ్యాయామ విద్యకు ప్రత్యేక గుర్తింపు

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని వ్యాయామ విద్య విభాగానికి ప్రతిష్టాత్మక అంతర్జాతీయ గుర్తింపు లభించింది. చైనా కేంద్రంగా పనిచేసే వరల్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అలైన్స్ లో వర్సిటీ వ్యాయామవిద్యకు సభ్యత్వం ఇవ్వడం జరిగిందని వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పి.పిఎస్. పాల్ కుమార్ తెలిపారు. చైనాలోని షాంఘై నగరానికి చెందిన ఈ సమాఖ్య ప్రపంచంలోనే 74 దేశాలకు చెందిన విశ్వవిద్యాలయాలతో సభ్యత్వం కలిగి ఉంది. వ్యాయామ విద్య విభాగానికి కూడా సభ్యత్వం లభించడం శుభ పరిణామం అని పేర్కొన్నారు. ఈ సభ్యత్వం ద్వారా విశ్వవిద్యాలయ క్రీడలు వాటి విశిష్టత ప్రపంచ నలుమూలల వ్యాపించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. గంగాధరరావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే. రత్న షీలామణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జీ. సింహాచలంలు పాల్ కుమార్ ను అభినందించారు.

నల్లమడ వాగు గండిని పరిశీలించిన రైతు సంఘం

ప్రజాశక్తి - పెదనందిపాడు

కాకుమాను మండలం కొండపాటూరు గ్రామ సమీపాన నల్లమడ వాగుకు పడిన గండిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, నాయకులు నల్లమోతు రాజేంద్ర, పి రామకృష్ణ, పి వెంకటేశ్వర్లు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్‌లో వచ్చిన తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వాగుకు గండి పడి భారీగా పంట నష్టం జరిగిందని తెలిపారు. అప్పటినుండి గండిని పూడ్చక పోవడంతో ఇప్పుడు వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల గండిలో నుంచి వరద ప్రవహించి సుమారు 600 ఎకరాలలో వరి పంట ముంపుకు గురైందని తెలిపారు. ఇప్పటివరకు వ్యవసాయ అధికారులు ముంపునకు గురైన పొలాలను పరిశీలించలేదని రైతులు వాపోతున్నారన్నారు. అదేవిధంగా నల్లమడ వాగు పక్కన ఉన్న పద్దాయ మురుగు కాలవ కూడా భారీ వర్షాల వల్ల కట్టలు తెగి పొలాల మీదకు నీళ్ల వస్తున్నాయి అన్నారు. వెంటనే అధికారులు గండిని పూడ్చాలని, వరద ప్రభావంతో వాగు సమీపంలోని పొలాలు కోతకు గురయ్యాయి అని ఆ పొలాలకు నష్టపరిహారం అందించాలని కోరారు. వ్యవసాయ అధికారులు వెంటనే పంటలను పరిశీలించి పంట నష్టం నమోదు చేయాలన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి-తాడేపల్లి

వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని తాడేపల్లి సిఐ కల్యాణరాజు చెప్పారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్ ద్వారా సింగిల్ విండో పద్ధతి ద్వారా అనుమతి తీసుకోవచ్చని చెప్పారు. విగ్రహాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు బాధ్యతగా ఉండాలని చెప్పారు. నిమజ్జనం రోజు మద్యం సేవించడం, బాణసంచా కాల్చడం, డిజెలతో ప్రజలకు అసౌకర్యం కలిగించడం వంటి వాటికి అనుమతి ఉండదన్నారు. పండుగ వాతావరణాన్ని రాజకీయంగా మార్చవద్దని విజ్ఞప్తి చేశారు.

నేటితో ముగియనున్న ఈ-క్రాప్ నమోదు

ప్రజాశక్తి - తెనాలి రూరల్

అధిక వర్షాలు, వరదలు కారణంగా నష్టపోయిన పంటలకు ఇన్పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) పొందుటకు అలాగే వరి, మినుము, అరటి పంటల భీమా పొందుటకు ఈ క్రాప్ నమోదు తప్పనిసరని తెనాలి మండల సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్ ఉషారాణి ప్రకటన విడుదల చేసారు. రైతులు నష్టపోయిన పంట, పంట నష్టం నమోదుకు వ్యవసాయశాఖ చివరి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దగ్గర్లోవున్న రైతు సేవా కేంద్రాల్లో సిబ్బంది, అలాగే విఆర్ఓ, పంచాయతి సెక్రెటరీలను సంప్రదించి నేటిలోగా పంట నమోదు చేసుకోవాలని తెలియజేసారు. రైతులు ముందుగా తమ పంటలకు ఈ క్రాప్ నమోదుచేసుకుని ఉండాలన్నారు. 33 శాతం కంటే అధికంగా దెబ్బతిన్న పంటలకు మాత్రమే బీమా వర్తిస్తుందని తెలిపారు.

ముఖ్యమంత్రి సహాయ నిధికి విట్ రూ.1.57 కోట్ల విరాళం

ప్రజాశక్తి - తుళ్లూరు : వరద బాధితుల సహాయార్థం రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఒక కోటీ 57 లక్షల 50 వేల రూపాయలను అందించారు. శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని విజయవాడ లోని కలెక్టర్ కార్యాలయంలో విట్ వ్యవస్థాపకులు డాక్టర్ జి విశ్వనాథన్, వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ కలిసి విరాళాన్ని అందించారు. విఐటి విశ్వవిద్యాలయం ద్వారా రూ.కోటి 50లక్షలు, విద్యార్థులు, అధ్యాపకులు ద్వారా 7లక్షల50వేలు విరాళాన్ని ముఖ్యమంత్రికి అందజేసినట్లు వారు తెలిపారు.

శర్వాణి ఇండస్ట్రీస్ రూ.10 లక్షల విరాళం

ప్రజాశక్తి - తాడేపల్లి



శర్వాణి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గోపాల్ రెడ్డి, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తో కలిసి ఈనెల 6వ తేదీన విద్యుత్ శాఖ మాత్యులు గొట్టిపాటి రవికుమార్‌ను తాడేపల్లిలోని వారి గృహంలో కలిసి రూ.10 లక్షల చెక్కును వరద బాధితుల సహాయం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయనిధికి అందించారు. ఈ సందర్భంగా జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, అధికార యంత్రాంగం ,ప్రజా ప్రతినిధులు అహర్నిశలు కషి చేస్తూ వరద బాధితులకు యుద్ధ ప్రాతిపదికన సహాయం అందించటం హర్షనీయమన్నారు.

పెదవడ్లపూడి టిడిపి నాయకులు రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

విజయవాడ వరద బాధిఆదుకునేందుకు వారికి సహాయర్థంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కి టిడిపి పెదవడ్లపూడి నాయకులు పాతూరు శ్రీనివాసరావు రూ.5లక్షలకు విరాళంగా శుక్రవారం అందించారు. రూ.5లక్షల చెక్‌ను రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో పాతూరి నాగ భూషణం, టిడిపి నాయకులు అన్నె శరత్ బాబు, చిల్లపల్లి కిరణ్, వల్లూరు సుబ్బారావు, గడ్డిపాటి సాంబశివరావు, యేళ్ల ప్రవీణ్, శీలం శ్రీనివాసరావు, ముసునూరు నాగయ్య, వున్నం నాని పాల్గొన్నారు.

వరద బాధితులకు అపుస్మా రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

వరద బాధితుల సహాయార్థం ఆంధ్ర‌ప్రదేశ్ ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మా) రూ.1లక్ష రూపాయాలు విరాళం అందచేసింది. అసోసియేషన్ ప్రతినిధులు విరాళం చెక్కును శుక్రవారం డిఇఒ పి.శైలజకు డిఇఒ కార్యాలయంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా గుంటూరు అర్బన్ ప్రెసిడెంట్ కన్న మాస్టారు, సెక్రెటరీ రవి, ట్రెజరర్ హుస్సేన్, సభ్యులు మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గోలివాగుపై చప్టా

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని గోలి గ్రామంలోని గోలి వాగుపై ఉన్న చప్టా ఇటీవల వర్షాలకు నామరూపాలు లేకుండా పోయింది. ఈ చప్టాపై పిల్లి వాగు, గోలి వాగు, ఏడు మంగళం వాగులు కలుస్తుండడం వల్ల నిత్యం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ చప్టా నుంచి జెట్టిపాలెం, మల్లవరం, సత్రశాల తదితర గ్రామాలకు జనం రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పుడు వారంతా ఇబ్బందులు పడుతున్నారు. దీనికి 7 మీటర్ల పొడవు 5.15 మీటర్ల వెడల్పు, 6 మీటర్ల పొడవు మూడు మీటర్ల వెడల్పుతో పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వరద బాధితుల కోసం సిపిఎం విరాళాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

విజయవాడ వరద బాధితుల కోసం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాలు సేకరించారు. స్థానిక పండరిపురంలోని సిపిఎం కార్యాలయం నుంచి ఎన్.ఆర్.టి.సెంటర్ మీదుగా చౌత్ర సెంటర్, గడియార స్తంభం మీదుగా కళా మందిర్ సెంటర్ వరకు దుకాణాల్లో విరాళాలు సేకరించారు. పట్టణ కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, ఎస్.బాబు, పి.పద్మ, ఎస్.దుర్గాబాయ్, ఆంజనే యులు, నాగేశ్వరరావు, పి.రాజు, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

విజయవాడ వరద బాధితుల కోసం సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విరాళాలు సేకరించారు. వసూలైన మొత్తాన్ని రాష్ట్ర కమిటీకి పంపుతామని నాయకులు చెప్పారు. కార్యక్రమంలో జి.హరిబాబు, ఎ.సుబ్బారావు, ఎన్.తులశయ్య, ఎన్.నాగేశ్వరరావు, ఎన్.రంగారావు, కె.సత్యం పాల్గొన్నారు.

వైద్య దంపతులు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

విజయవాడ వరద బాధితులకు సాయం చేసేందుకు సత్తెనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో పనిచేస్తున్న ఇద్దరు డాక్టర్లు ముందుకొచ్చారు. ఎముకల డాక్టర్ అప్పికట్ల ప్రవీణ్ కుమార్, ఆయన భార్య అయిన చిన్నపిల్లల డాక్టర్ అప్పికట్ల ప్రేమ రూ.50 వేల చెక్కును ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు ఆధ్వర్యంలో అందజేశారు.

ప్రకృతి వ్యవసాయం క్షేత్ర ప్రదర్శన

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని కొత్తపాలేనికి చెందిన కె.వెంకటేశ్వరరావుకు చెందిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి శుక్రవారం సందర్శించారు. వెంకటేశ్వరరావు తన పొలంలో రసాయన ఎరువులు ఉపయోగించకుండా అనేక రకాల కూరగాయలు, ఆకుకూరలు, తీగజాతి, దుంపజాతి కూరగాయలను పండిస్తున్నారని చెప్పార. ఆయన 365 రోజులు భూమిని కప్పి ఉంచే పద్ధతిని అనుసరిస్తూ నెలకు సగటున రూ.25-30 వేల ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. ఇలాంటి సాగువల్ల పర్యావరణానికి మేలుతోపాటు రసాయనాల్లేని, ఆరోగ్యకరమైన కూరగాయలూ లభిస్తాయని చెప్పారు. గ్రామంలోని అన్ని ప్రకృతి వ్యవసాయ పొలాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించాలని సూచించారు.

నందిగామలో దెబ్బతిన్న పత్తి పైరు

భారీ వర్షాలకు పత్తికి అపార నష్టం

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

వర్షాల వల్ల మండలంలోని పత్తికి అపార నష్టం వాటిల్లింది. రైతులు కష్టపడి సాగుచేసిన పత్తి పంట వరద నీటిలో నేటికీ నానుతోంది. వాగుల పరివాహ ప్రాంతాల్లో రైతులు సాగుచేసిన పత్తి పంట దెబ్బ తింది. కొన్నిచోట్ల వరి పంటకు నష్టం వాటిల్లింది. ఎద్దు వాగు పరివాహ ప్రాంతంలో సాగైన వరి పంట నీట మునిగి మట్టితో మేటవేయటంతో మాగాణి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నందిగామ, గుడిపూడి, పెదమక్కెన, భీమవరం, భట్లూరు, కట్టమూరు తదితర గ్రామాల్లో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నదిగామలో 45 ఎకరాలు, గుడిపూడిలో 35 ఎకరాలు, పెదమక్కెనలో45 ఎకరాలు, భీమవరంలో నాలుగెకరాలు, భట్లూరులో మూడెకరాలు, కట్టమూరులో 10 ఎకరాల్లో పత్తికి నష్టం వాటిల్లింది. వ్యవసాయ అధికారుల బృందం మండలంలో వివిధ గ్రామాల్లో సర్వే చేసి నష్టాన్ని అంచనా వేశారు. 95 మంది రైతులకు చెందిన 142 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు నిర్ధారించారు. బాధితుల్లో ఎక్కువ మంది కౌలు రైతులే.

జిల్లా కోర్టులో ఎంవి రెడ్డి ఐ హాస్పిటల్ వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రతి ఒక్కరూ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన కళ్లుగా మార్చుకోవచ్చని తద్వారా కంటి చూపు మెరుగు పడుతుందని నరసరావుపేట ఎంవి రెడ్డి హాస్పిటల్ అధినేత డాక్టర్ ఎల్.సృజన అన్నారు. నరసరావుపేట పట్టణంలోని 13 వ అదనపు న్యాయస్థానం భవన సముదాయంలో శుక్రవారం ఎంవి రెడ్డి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా శిబిరాన్ని జిల్లా జడ్జి సత్యశ్రీ ప్రారంభించారు. న్యాయవాదులకు ఆయా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన కక్షిదారులకు మొత్తంగా 134 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులిచ్చారు. వీరిలో 90 మందికి కళ్లజోళ్లు అవసరం కాగా 30 శాతం రాయితీపై పంపిణీ చేశారు. 22 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజన మాట్లాడుతూ శరీర అవయవాల్లో అత్యంత సున్నితమైన కళ్ల పట్ల అశ్రద్ధ వహిస్తే కంటి చూపు మందగించే అవకాశం ఉందన్నారు. పెరిగిన స్క్రీన్ సమయం, కాలుష్యం, అనారోగ్యకరమైన జీవనశైలి కారణంగా కంటి సమస్యలు పెరుగుతున్నాయన్నారు.

జిల్లా జడ్జి సత్యశ్రీకి కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఎల్.సృజన

ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్లు ఏ, సి, జింక్ తో కూడిన ఆహారం కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని చేపలు, క్యారెట్లు, చిక్కుళ్లు, బచ్చలికూర, ఆకుకూరలు, సిట్రస్ పండ్లలో కంటికి అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయని చెప్పారు. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి స్క్రీన్ నుండి చిన్న విరామం తీసుకోవడం ముఖ్యమన్నారు. ధూమపానమూ కంటి సమస్యలు తెస్తుం దన్నారు. తమ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి కంటి చూపు సమస్యలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

డిజెలతో చిలకలూరిపేట మోత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వినాయక చవితి సందర్భంగా డిజె సౌండ్లతో చిలకలూరిపేట మోత మోగుతోంది. విగ్రహ ఏర్పాటు, నిమజ్జన సమయాల్లో డిజెలు పెడుతూ హోరెత్తిస్తున్నారు. గతేడాది ఇక్కడివి చాలక తెలంగాణ నుండి ప్రత్యేకంగా బాక్సులను తెప్పించారు. ఇలాంటివి వాడకూడదనే పోలీసుల హెచ్చరికలు పటాపంచలవుతున్నాయి. ఈ శబ్దాలకు చిన్నారులు, వృద్ధుల గుండెలు దద్దరిల్లుతున్నాయి. గుండె సంబంధిత అనారోగ్యం ఉన్నవారికి ఇది మరీ ప్రమాదబరితంగా మారింది. పట్టణంలో 20-25 వరకు భారీ విగ్రహాలు, 150 వరకు చిన్నపాటి పందిళ్లు వెలిశాయి. మండలం మొత్తంగా ఈ సంఖ్య 250కు పైగానే ఉండొచ్చు. పట్టణంలో 10-15 వరకు డిజె ప్రోగ్రాంల నిర్వాహకులు ఉండగా నియోజకవర్గ స్థాయిలో 50-60 వరకు ఉన్నాయి. వీటికితోడు ఇతర ప్రాంతాలవీ పట్టణానికి వచ్చి మోత పుట్టించనున్నాయి.

విప్పర్లలో పొలంబడి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలో విప్పర్లలో శుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం జరిగింది. గ్రామంలో గత కొద్ది రోజులు వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న దృష్ట్యా పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శిక్షణా కేంద్రం వ్యవసాయ ఉపసంచాలకులు శివకుమారి, నరసరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు మస్తానమ్మ మాట్లాడుతూ సూడోమోనాస్ బాక్టీరియా పొడితో విత్తన శుద్ధి చేసుకోవాలని అన్నారు. విత్తన శుద్ధి ప్రయోజనాలను వివరించారు. తక్కువ ఖర్చులతో పంట పంపించటానికి అవసరమైన చర్యలు గురించి రైతులకు అవగాహన కలిగించారు. మండల వ్యవసాయ అధికారిణి శివలలిత, విఎఎలు రాజశేఖరరెడ్డి, వేమారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వరద సహాయక కార్యక్రమాల్లో పల్నాడు ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

విజయవాడ వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా వుంటుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. విజయవాడ 15వ డివిజన్ గాంధీ కాలనీలో వరద సహాయక చర్యలను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పర్యవేక్షిస్తున్నారు. బాధితుల వద్దకు స్వయంగా వెళ్లి నిత్యావసర సరుకులు సరఫరా అందిస్తున్నారు. పారిశుధ్య కార్యక్రమాలు, ఫైర్ ఇంజిన్ల ద్వారా ఇళ్లు శుభ్రం చేసే పనులను పరిశీలిస్తున్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వరదలతో అవస్థలు పడుతున్న ప్రజానీకానికి అండగా నిలిచే కార్యక్రమంలో తన వంతు బాధ్యత నెరవేర్చేందుకు ఎప్పుడూ ముందుంటానని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. విజయవాడ నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. వరదల

కారణంగా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని చెప్పారు. ఇదిలా ఉండగా విజయవాడ 40వ డివిజన్ పరిధిలో వరద బాధితులకు నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే అందజేశారు.

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో 4వ రోజు ఆయన పర్యటించారు. 46వ డివిజన్లో ప్రజల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, ఆహారం, బిస్కెట్లు అందజేశారు. పరిసరాలను, గృహాలను శుభ్రం చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, నష్టాన్ని అంచనా వేసి సహాయ సహకారాలు అందజేస్తారని చెప్పారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శనివారం 7 సెప్టెంబర్ 2024

ఎంబివికె ద్వారా ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతమైన మహానాడు కృష్ణానది ఒడ్డు ప్రాంతంలో బాధితులకు ఆహారం పంపిణీ చేశారు. వరద తగ్గుముఖం పట్టిన తరువాత ఎవరూ తమ వైపు చూడటంలేదని, తమ గురించి పట్టించుకోవడంలేదని బాధితులు చెప్పారు. ప్రతి ఇంట్లో ఆకలికేకలు వినిపిస్తున్నాయి. ఆహారం కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఇప్పటికీ వరద బురదతోనే సావాసం చేస్తున్నామని బాధితులు తాము ఉంటున్న నివాసాలను, ఇళ్లల్లో పేరుకుపోయిన బురదను ఎంబివికె, సిపిఎం నాయకులకు చూపించారు. ప్రతి ఇంటి ముందుకు వెళ్లి ఆహారం అందజేయడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మహానాడులోని రెండు పాయింట్లలో ఉదయం, సాయంత్రం వెయ్యి మందికి భోజనాలు అందజేశారు. ఇళ్లల్లోకి నీళ్ళు వచ్చిన రెండు రోజులు అందరూ కనిపించారని, వరద తగ్గిర తరువాత మీరే వచ్చారని ఎంబివికె నాయకులను చూసి బాధితులు తమ సంతోషం వ్యక్తం చేశారు. సిపిఎం కార్యకర్తలు భోజనం వండి

బాధితులకు అందజేసే దానిలో కీలకపాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, ఎంబివికె బాధ్యులు పి.విజయ, అమరావతి ఐకాన్ షితిజ, విజ్ఞాన కేంద్రాల తాడేపల్లి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, స్థానిక సిపిఎం నాయకులు నారిన నాగేశ్వరరావు, జగన్, ఎస్.వెంకట్రావు, వై.బర్నబస్, కె.ఉష, ఎల్.సత్యం, బిట్రా రామారావు, ఎస్కె బాష, రేణుక, జి.సాయి, చంద్రశేఖర్, డి.యోహాన్, డి.విజయ్, సిహెచ్.కోటేశ్వరరావు, యు.నాని, రాము, ఎస్.అర్జున్, బత్తుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకాలనీలో...: నులకపేట రామయ్యకాలనీలో వరద బాధితులకు సిపిఎం తాడేపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భోజన సదుపాయం కల్పించారు. వారం రోజుల నుంచి పనులు కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న తమకు భోజనం సదుపాయం కల్పించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. 500 మందికి భోజన సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వేముల దుర్గారావు, బూరుగ వెంకటేశ్వర్లు, వి.రమణ, వెంకన్న, వి.శాస్త్రి, శేషయ్య, మణి, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ: నులకపేట రామయ్యకాలనీలో సర్వస్వం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఎపి ట్రాన్స్‌కో విజయవాడ ఉద్యోగి బి.శ్రీరామచంద్రమూర్తి, సుస్మిత ఆధ్వర్యంలో 125 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంబివికె బాధ్యులు పి.మురళీకృష్ణ మాట్లాడుతూ సేవాతత్పరతతో ముందుకు రావడాన్ని శ్రీరామచంద్రమూర్తి దంపతులను అభినందించారు. సుందరయ్యనగర్‌లో భోజనాలు ఏర్పాటు చేయడంలో, రామయ్యకాలనీలో దుప్పట్లు పంపినీ చేయడంలో ముందుపీఠిన ఉన్నారని కొనియాడారు.

విజయవాడ ముంపు బాధితులకు పలువురు ఆపన్నహస్తం

విజయవాడకు పంపిస్తున్న కూరగాయలు, పాలు, వాటర్ ప్యాకెట్లు

మంగళగిరిలో పలు కళాశాలల వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి : నిర్మల జూనియర్ కళాశాల, శ్రీ విష్ణు జూనియర్ కళాశాల,విజెపి అండ్ డిఎల్‌బి డిగ్రీ కళాశాల డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్ ప్రసాద్, డి శ్రీనివాసరావు, టి మనోజ్ కుమార్, శ్రీకాంత్ అధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయార్థం శుక్రవారం కూరగాయలు, పాల ప్యాకెట్లు పంపించారు. కళాశాల యాజమాన్యాలు 400 కుటుంబాలకు 8 రకాల కూరగాయలు, వాటర్ ప్యాకెట్లు, పాల ప్యాకేట్లను పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - మంగళగిరి: మంగళగిరి పట్టణం 5,6,వ వార్డులోని ఇందిరా నగర్ లో 35 చేనేత కార్మికుల కుటుంబాలకు ఒక్కోక్క కుటుంబానికి 50 కేజీల బియ్యం, కేజీ చొప్పున కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు, పంచదార, బంగాళదుంపలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీమతి తమ్మిశెట్టి జానకి దేవి,మంగళగిరి తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, రాష్ట్ర సాధికార సమితి కష్ణ బలిజి సభ్యుడు అన్నం నాగబాబు,పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు వాకా మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లంక గ్రామాలకు సహాయం

లంక గ్రామాలకు సహాయం

ప్రజాశక్తి - మంగళగిరి : బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్ రావు ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న వేమూరు నియోజకవర్గ లంక గ్రామాల ప్రజలకు తాగునీరు, నిత్యవసర సరుకులు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ప్రజాశక్తి - మంగళగిరి :మంగళగిరి నియోజకవర్గం కాపు బలిజ సంక్షేమ సేన అధ్యక్షులు, జనసేన పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు రంగశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహానాడులోని వరద బాధితులకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.

వరద బాధిత కుటుంబాలకు టిడిపి సాయం

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఇటీవల కురిసిన అధిక వర్షాలకు, వరదలు సంభవించి, పనులు కోల్పోయిన 37 కుటుంబాలకు, శుక్రవారం సాయంత్రం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో నిత్యవసర సరుకులను టిడిపి నాయకులు అందజేశారు. అదేవిధంగా గుండె మెడ గ్రామంలో ఆరుగురు వరద బాధితులకు టిడిపి తాడేపల్లి మండల ఉపాధ్యక్షులు గుండిమడ రమేష్ బాబు, టిడిపి గుండిమెడ గ్రామ అధ్యక్షులు చిగురుపాటి సుబ్బారావు నిత్యవసర సరుకులు బియ్యం, నూనె, కందిపప్పు తదితర సరుకులను బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారిని ఆశ, టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదన రావు, టిడిపి గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి ప్రధాన కార్యదర్శి మద్దినేని సుబ్రహ్మణ్యం, గోరా బాలాజీ, కామినేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేశ్వరంలో బాధితులకు టిడిపినాయకుల సాయం

పునరావాస కేంద్రాల్లో భోజన వసతి

ప్రజాశక్తి - తెనాలి

వరదలు, వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని మండల తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ చెప్పారు. ఆయన ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున బియ్యం, నిత్యావసరాలను రూరల్ గ్రామాలు కొలకలూరు, అంగలకుదురు, కోపల్లె గ్రామాలలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ముంపు గ్రామాల్లో బాధితులకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి భోజన వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. గ్రామాల్లో వరదలు, వర్షాలు కారణంగా ప్రజలకు ఏదైనా నష్టం జరిగితే తక్షణమే నివేదిక పంపాలని విఆర్వో లను ఆదేశించారు. అంగలకుదురు, కోపల్లె గ్రామాల్లో బాధితులకు వంట పాత్రలను గణేష్ యూత్ బందం అందజేసింది. అలాగే కొలకలూరు బాధితులకు రూ.2వేల చొప్పున నగదును అందించారు. కార్యక్రమంలో కొలకలూరు సర్పంచ్ డాక్టర్ చొప్పర ప్రీతి, అంగలకుదురు ఉపసర్పంచ్ కనగాల నాగ భూషణం, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, నాయకులు ఎస్ మురళీధర్, ఎన్ రవి, జి.కృష్ణమోహన్, విఆర్వో లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సరుకుల పంపిణీలో తహశీల్దార్, సర్పంచ్ బృందం

పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుణ్ణి మాత్రమే వినియోగించాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మట్టి వినాయకుణ్ణి పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నల్లమోతు చెంచు రామనాయుడు మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మారిస్ పేట నుండి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయని పివి సుధారాణి మాట్లాడుతూ మట్టి విగ్రహాలను పూజించాలని అన్నారు. తద్వారా పర్యావర ణాన్ని కాపాడుకోవాల్సిన అవశ్యకత మనపై ఉందని తెలియజేశారు. స్కౌట్ మాస్టరు కె స్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థుల చేత మట్టి విగ్రహాలను తయారు చేయించి అవగాహన ర్యాలీ నిర్వహిం చామన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్సిఆర్‌ఎం పాఠశాల స్కౌట్ విద్యార్థులు

వినాయక గొడుగుల విక్రయాల్లో మత్స్యకారులు

ప్రజాశక్తి - మంగళగిరి :వినాయక చవితి సందర్భంగా తుళ్లూరు మండలం వెంకట పాలెం గ్రామానికి చెందిన మత్స్యకారులు వినాయక చవితి పండగ సందర్భంగా మంగళగిరి వచ్చి వినాయక గొడుగుల విక్రయాలతో కొంతవరకు ఆదాయం పొందామని లక్ష్మయ్య అన్నారు. వెంకటపాలెం గ్రామం నుండి అనేక సంవత్సరాలుగా 10 కుటుంబాల వారు వినాయకుల గొడుగులు చేసుకుని విక్రయాలు చేస్తూ ఉంటామని తెలిపారు. దీనికోసం మూడు రోజులు పాటు కష్టపడాల్సి ఉంటుందని తెలిపారు. విజయవాడ వెళ్లి మెటీరియల్ తీసుకువచ్చి గొడుగులను కుటుంబ అంతా కూర్చొని తయారు చేసుకొని మంగళగిరి వచ్చి అమ్ముకుంటూ ఉంటామని తెలిపారు. వాతావరణం అంతా సక్రమంగా ఉంటే అమ్మకాలు జరిగితే కొంతవరకు ఆదాయం మిగులుతుందని తెలిపారు. వర్షం పడితే మరల నష్టం వాటిల్లుతుందని వాపోయారు. మిగిలిపోతే తెచ్చిన మెటీరియల్‌ను మళ్లీ వచ్చే వినాయక చవితి వరకు జాగ్రత్తగా ఉంచుకొని తయారు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇక మిగిలిన కాలం అంతా కృష్ణా నదిలో చేపలు పట్టుకొని అమ్ముకొని జీవిస్తూ ఉంటామని చెప్పారు.



వినాయక గొడుగులతో ఉన్న విక్రయదారులు

ప్రసూన ఛారిటబుల్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

వరదలు కారణంగా కష్టాలు పడుతున్న పేద వృద్దులకు కూచిపూడి ప్రసూన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. తెనాలి మండలం నందివెలుగు గ్రామంలో ఏర్పాటుచేసిన పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా తెనాలి రూరల్ ఎస్సై ప్రతాప్ మాట్లాడారు. పేద వద్దులకు అన్న దానంతో పాటు దుప్పట్లు పంపిణీ చేయడం దాతలు కూచిపూడి ప్రవీణ్, కనపాల ఆనందబాబు లను అభినందించారు. గ్రామంలో ఎటువంటి లా అండ్ ఆర్డర్ సమస్యలు నెలకున్నా తమ దష్టికి తేవాలని సూచించారు. ట్రస్ట్ తరపున ప్రారంభమైన సభకు మోహన్ బాబు సభ అధ్యక్షత వహించారు.

వెలుగు స్వయం సహాయక సంఘాల సాయం

ప్రజాశక్తి - చేబ్రోలు

వెలుగు స్వయం సహాయక సంఘాల నుండి ఆరు లక్షల ఇరవై తొమ్మిది వేల ఆరు వందల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది. కృష్ణా, గుంటూరు ఉమ్మడి జిల్లాలలో నష్టపోయిన కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకొనుటకు మండలంలోని 1259 స్వయం సహాయక సంఘాల నుండి నగదు జిల్లా కలెక్టర్ అధికారిక ఖాతాకు పంపడం జరిగిందని మండల వెలుగు ప్రాజెక్టు ఏపిఎం వి నాగేశ్వరరావు తెలిపారు. గృహాలు, ఇంటిలోని వస్తువులు బురద కొట్టుకుపోయి, నష్టపోయిన బాధితులకు సహకారం చేయుటకు ప్రభుత్వం, అధికారుల సూచన మేరకు సహాయాన్ని వసూలు చేశామని ఎపిఎం తెలిపారు.

ముంపు పొలాల్లో జడ్‌పి ఛైర్‌పర్సన్ పరిశీలన

ప్రజాశక్తి - తెనాలి

భారీ వర్షాలు, వరదల ప్రభావంతో రూరల్ గ్రామం హాఫ్ పేట ప్రాంతంలో ముంపుకు గురైన పంట పొలాలను జిల్లా పరిషత్ చైర్పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా శుక్రవారం పరిశీలించారు. అ ప్రాంత రైతులు తమ పొలాలు ముంపుకు గురయ్యాయని, తీరని నష్టం వాటిల్లిందని ఆమె ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్ పర్సన్ క్రిస్టినా గారు మాట్లాడుతూ పంట పొలాలను చూస్తుంటే చాలా బాధగా ఉందని, రైతుల ఆవేదన తనను కలచివేసిందన్నారు. విషయాన్ని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, క్యాబినెట్ మంత్రుల దష్టికి తీసుకువెళతానన్నారు. అలాగే గ్రామంలో పర్యటించిన ఆమె ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

మినీ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను పంపుతున్న జోసిల్ సిబ్బంది

వరద బాధితులకు జోసిల్ కంపెనీ సాయం

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని నరసరావుపేట రోడ్ లోని డోకిపర్రు జోసిల్ కంపెనీ యాజమాన్యం రూ.2 లక్షల విలువచేసే బిస్కెట్ ప్యాకెట్లను కంపెనీకి చెందిన మినీ లారీలో వరద బాధితులకు వేరు, వేరు ప్రాంతాలకు తరలించారు. తుళ్లూరు మండలం, కొల్లిపర మండలాల్లోని వరద బాధితుల కు జిల్లా కలెక్టర్, ఆర్డిఓ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఈ పంపిణీ నిర్వహించినట్లు యాజమాన్యం తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ సెక్రెటరీ డీజీఎం ఫైనాన్స్ కె రఘురాం, సీనియర్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్ బి శేషగిరిరావు, కంపెనీ ప్రొడక్ట్ కొనుగోలు మేనేజర్ ఎన్ కృష్ణ ప్రసాద్, పలువురు కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య మధుబాబుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

యుడోక్సియా అమెరికా, భారత్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ సంస్థ ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, ఎకనామిక్స్ విభాగధిపతి ఆచార్య కడిమి మధుబాబుకు స్థానం లభించింది. ఈ మేరకు యుడోక్సియా సంస్థ నుండి ప్రశంసా పత్రం ఆయనకు అందింది. యుడోక్సియా సంబంధిత రంగాలకు వారి అసాధారణమైన సహకారానికి అత్యుత్తమ వ్యక్తులను గుర్తిస్తుంది. తన లైఫ్‌టైమ్ ఫెలో మెంబర్‌షిప్ మరియు ఇంటర్నేషనల్ రాయల్ గోల్డెన్ అవార్డ్ ద్వారా, యుడోక్సియా వారి నైపుణ్యం ఉన్న రంగాలలో గణనీయమైన ప్రభావం చూపిన వారిని సత్కరిస్తుంది. ఈ సందర్భంగా ఆచార్య మధుబాబును వర్సిటీ అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు శుక్రవారం అభినందించారు.

కిట్స్ అక్షర్ కళాశాలలో 36 గంటల హ్యాకథాన్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న మధు పర్వతనేని

యనమదలలోని కిట్స్ అక్షర్ కళాశాలలో 36 గంటల హ్యాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం మేక్ స్కిల్డ్ సిఇఒ మధు పర్వతనేని ఆధ్వర్యంలో బి.టెక్ నాల్గవ సంవత్సరం విద్యార్థులను నిర్వహిం చారు. కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలకు ఇలాంటి వేదికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకోటయ్య, సిఎస్‌సి, ఇసిఇ విభాగాధిపతులు డాక్టర్ గురు కేశవ్‌దాస్, డాక్టర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

డిసెంబర్ 17న విజ్ఞాన్‌లో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో డిసెంబర్ 17 నుంచి రెండ్రోజులపాటు అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. శుక్రవారం వర్సిటీలో సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫుడ్ టెక్నాలజీ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ అండ్ హార్టికల్చరల్ సైన్సెస్, అపారి (ఆసియా-పసిఫిక్ అసోసియేషన్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్స్) , యూరోపియన్ ప్లాంట్ హెల్త్ రీసెర్చ్ అండ్ కోఆర్డినేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ' ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా : రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సదస్సుకు అపారి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రవి ఖేతర్‌పాల్, ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాక్వెలైన్ డీఆరోస్ హుగెస్, ఐసీఆర్ఎఎఫ్ వరల్డ్ ఆగ్రోఫారెస్ట్రీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రవి ప్రభు, ఆంగ్రూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి దేవి, డాక్టర్ వైఎస్ఆర్‌హెచ్‌యూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కే.గోపాల్, పీపీఏఐ ప్రెసిడెంట్ డాక్టర్ బీ.శరత్‌బాబు పాల్గొంటారని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న వారితో ప్రిన్సిపాల్ తదితరులు

ఆర్‌విఆర్‌లో స్మార్ట్ ఐడియా ఛాలెంజ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'స్మార్ట్ ఇండియా హాకథాన్-2024'లో పాల్గొనేందుకు తమ కళాశాల విద్యార్థులు సిద్ధంగా వున్నారని ఆర్.వి.ఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె. మద్దినేని తెలిపారు. వివిధ రంగాల్లో ఏర్పడే సాంకేతిక సమస్యలు అధిగమించేందుకు, సులువైన పరిష్కార మార్గాలకు విద్యార్థుల ఆలోచనలను ప్రయోగాత్మకంగా పరిశీలించి, వారి ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'స్మార్ట్ ఇండియా హాక్ థాన్ - 2024' పోటీల్లో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు, కళాశాలలోని ఆర్.వి.ఆర్ అండ్ జెసి, స్టెప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈడి సెల్, క్లబ్ ఇన్నోఫోర్జ్ సంయుక్త సహకారంతో 'స్మార్ట్ ఐడియా ఛాలెంజ్-2024' పేరుతో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ విభాగాలకు చెందిన 44 జట్ల విద్యార్థులు పాల్గొని స్మార్ట్ ఆటో మేషన్, విపత్తు నిర్వహణ, మెడ్ టెక్ / బయోటెక్ , గ్రామీణాభివద్ధి, ఆహారం - వ్యవసాయ సాంకేతికత , క్లీన్ అండ్ గ్రీన్ టెక్నాలజీ, విపత్తు నిర్వహణ వంటి వివిధ అంశాలపై నూతన ఆలోచనలను, మరియు వివిధ రంగాలలో పలు సందర్భాలలో ఏర్పడుతున్న సమస్యలకు సులువైన పరిష్కార మార్గాలను వివరించారు. ఈ పోటీల్లో 8 జట్లు ఫైనల్స్‌కి చేరగా అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 3 జట్లను ఎంపికచేసి ప్రోత్సాహక నగదు బహుమతులను, సర్టిఫికెట్ లను, మెమొంటోలను విజేతలకు అందజేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఓపెన్ ఇన్నోవేషన్ మోడల్‌గా నిర్వహించే 'స్మార్ట్ ఇండియా హాక్‌థాన్'లో తమ కళాశాల నుండి 20 జట్లు పాల్గొంటున్నట్లు కళాశాల సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పైర్లను కాపాడేందుకు కృషి

ముంపు నుంచి బయటపడేందుకు రైతులు జాగ్రత్తలు పాటించాలి : వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.గిరిధర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వాయుగుండం ప్రభావంతో కురిసిన అతి భారీ వర్షాలకు ముంపునకు గురైన పైర్లను కాపాడుకునేందుకు రైతులు పలు జాగ్రత్తలు పాటించాలని వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త డా.కె. గిరిధర్ కోరారు. గుంటూరులోని లాం ఉద్యాన యూనివర్సిటీలో ఆయన ఈమేరకు పలు సూచనలు విడుదల చేశారు. వర్షాలు అధికంగా కురవడం వలన లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడి మిరప, పసుపు, కూరగాయ అరటి వంటి ఉద్యాన పంటల్లో నీరు నిలబడి ముంపునకు గురై నష్టం వాటిల్లుతుంది. ఈ పరిస్థితుల్లో అధిక తేమ వలన వేర్ల ద్వారా మొక్క అవసరమైన పోషకాలను తీసుకోలేదు. మొక్కలు ఉరకెత్తి తలలు వాల్చుతాయి. పంటలను తెగుళ్ళు ఆశించడమే కాకుండా సూక్ష్మధాతు లోపాలు కూడా ఎక్కువగా కనబడే అవకాశం ఉంది. ఈపరిస్థితుల్లో పంట దశ మరియు ముంపు ఉదతిని బట్టి తగిన జాగ్రతలు పాటించినట్లైతే పంటను రక్షించుకొని నష్టాన్ని కొంతవరకు తగ్గించుకొనే అవకాశం ఉందన్నారు.

మిర్చిపై సూచనలు : మిరప పంటలో నారు మళ్లలో మురుగు నీటిపారుదల చేయాలి. మళ్లలో ఎక్కడా నీరు నిలవకుండా చూడాలి. నారు కుళ్ళు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లేదా రిడొమిల్ 2 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి వారం రోజుల వ్యవధి లో రెండు సార్లు నేల తడిచేటట్లుపిచికారి చేయాలన్నారు. కొయనోఫోర కుళ్ళు తెగులు బాక్టీరియా ఆకుమచ్చ తెగులు ఆశించేఅవకాశం ఉంది కాబట్టి వీటి నివారణ కు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు స్ట్రెప్టోసైక్లిన్ 0.1 గ్రా. ఒక లీటరు నీటికి చొప్పున కలిపి వారం రోజుల వ్యవధి లో రెండు సార్లు పిచికారి చేయాలి.

కూరగాయపంటలు : ముంపుకు గురై, కాపుతో వుండి వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదళ్ళు చుట్టూ మట్టినిఎగదోయాలి. నారు అందుబాటులో ఉన్నట్లయితే లేత తోటల్లో చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తమొక్కలు నాటుకోవాలి. పంటబాగా ముంపుకుగురై అధిక శాతంమొక్కలు చనిపోయినట్లితే, పంటను పూర్తిగా తొలగించి నేల అదునుకు వచ్చిన తర్వాత అనుకూలమైన పంటలను వేసుకోవాలి. అదనంగా యూరియా, పోటాష్ మరియు వేపపిండి వేయాలి. మొక్కలు తేరుకున్నతర్వాత స్థూల పోషకాల మిశ్రమం (19-19-19) 5గ్రా., మెగ్నీసియం సల్ఫేట్ 5 గ్రా. , మరియు సూక్ష్మ పోషకాల మిశ్రమం 2.5 గ్రా.లీటరు నీటికి ఒక దాని తర్వాత ఒకటి వారం రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారిచేయాలన్నారు.

పసుపు పంట :పసుపు తొలి దశలోని తోటలో నీరు రెండు రోజుల కంటే ఎక్కువ రోజులు ఉన్నట్లయితే నష్టం అధికంగా ఉంటుందన్నారు. పసుపు పంటముంపునకు గురైనప్పుడు పొటాషియంనైట్రేట్ 5 గ్రా. , మెగ్నీసియం సల్ఫేట్ 5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి 2-3 సార్లు వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలన్నారు. ముంపుకు గురైన పసుపు పంటలో ఇనుపధాతు లోపం కనపడుతుంది. దీనినివారణకు 2 గ్రా. ఫెర్రస్‌సల్ఫేట్ 1 గ్రా. నిమ్మ ఉప్పు కలిపి పిచికారి చేయాలి. జింక్ సల్ఫేట్ ను 3 గ్రా. లీటరు నీటికి కలిపి 2 సార్లు వారం రోజుల వ్యవధిలో పిచికారి చేయాలన్నారు. నేల అదునుకు వచ్చిన వెంటనే అంతరకషి చేసి, 50 కిలోల యూరియా, 40 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్ ను ఒక ఎకరానికి అదనపు మోతాదుగా ఇవ్వాలి.

అరటి:అరటిలో అధిక వర్షాల వలన కలిగే నష్టం అనేది రకం, మొక్క వయస్సు, నేలస్వభావం మరియు నీరునిల్వ ఉండే సమయంపై ఆధారపడి ఉంటుంది. అరటి రకములలో కర్పూర చక్కెరకేళి రకం నీటి ముంపుకు కొంతవరకు తట్టుకుంటుంది. ముఖ్యంగా 3 నెలలు వయస్సు లోపల ఉన్న తోటలలో నష్టం అనేది అధికంగా ఉంటుంది. 2 రోజులు నీరు పొలంలో నిలబడి నట్లయితే మొక్క పెరుగుదల తగ్గుతుంది. అదే 3-4 రోజులు కంటే ఎక్కువగా నీరు నిలబడి నట్లయితే లేత మొక్కలు చనిపోతాయి. ఎక్కువ రోజులు నీరు అధికంగా ఉన్న తోటల్లో సిగటోకా ఆకుమచ్చ తెగులు, దుంప కుళ్ళు తెగుళ్ళు ఉధృతి అధికంగా ఉంటుంది. ఇలాంటి పరిస్థితిలో బ్లీచింగ్ పౌడర్ 25 గ్రా. లీటరు నీటికి కలిపి పాదుల్లో పోయాలి. ఆకుమచ్చ తెగుళ్ళ నివారణకు ప్రోపికోనజోల్ 1 మీ.లీ. లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. అరటి వరుసల మధ్య నిల్వఉన్న నీటిని కాలువలు ద్వారా తీసి బయటకు పంపించాలి. దీనివలన అరటి వేర్లకు గాలిప్రసరణ బాగా జరుగుతుంది.

మట్టి ప్రతిమలతో పర్యావరణానికి మేలు

పలు పాఠశాలలు, సంస్థల ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

వినాయక ప్రతిమలు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

లాం చలపతి ఇంజినీరింగ్ కాలేజి, సిఎస్ఇ టెక్‌వింగ్స్, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో లక్ష్మీపురం, పట్టాభిపురం, బృందావన్ గార్డెన్స్ ప్రాంతంలో సుమారు 700 వినాయకుడి మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ యం.చంద్రశేఖర్ మాట్లాడుతూ మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను వినియోగించటం వల్ల పర్యావరణాన్ని కాపాడుకుంటామన్నారు. రసాయనాలతో మిళతమైన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినియకుడి ప్రతిమలు వినియోగించటం వల్ల జలకాలుష్యం జరిగి, నీటిలో ఉండే జీవరాసులు మనుగడ కష్టం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.బాలాజీ, యు.నాగ గోపిరాజు, కె.వెంకటరామారావు, పి.వెంకట నరేంద్ర, ఏ.రాధాకృష్ణమూర్తి, అకడమిక్ డీన్ జె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, మట్టి గణపతిని పూజించి, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అన్నారు. స్థానిక అమరావతి మెయిన్ రోడ్డులో ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో ధర్మచరణ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలకు ప్రతిమలను అందచేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, మెర్క్యూరీ సీసం, బ్రోమిన్, వంటి విష రసాయనాల చేత తయారు చేసిన విగ్రహాలు నీటిని కలుషితం చేస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలు వాడాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ధర్మచరణ్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్ర ్మంలో ఓలేటి అరవింద్, మైలవరపు చంద్ర, గుళ్ళపల్లికుమార్, కోటగిరి అనిల్, గాజుల సాయిరాం, ఆది, శంకర్, అయ్యప్ప, సుబ్బు, కిరణ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వద్ద పర్యావరణ శాస్త్ర విభాగం, సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంటల్ ఎడ్యుకేషన్ అండ్ ఎకలాజికల్ డెవలప్మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా వినాయక మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ ప్రతిమలను ముందుగా ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం కు

వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న తులసి ధర్మచరణ్

అందజేశారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే. వీరయ్య, అధ్యాపకులు బ్రహ్మాజీరావు, ఏవీఎస్ స్వామి, డాక్టర్ కే .శశిధర్ డాక్టర్ ఎం వెంకట రమణలు అధ్యాప కులకు, ఉద్యోగులకు, విద్యార్థులకు ఈ ప్రతిమలను అందజేశారు.

ప్రజాశక్తి-గుంటూరు :స్థానిక బ్రాడీపేటలోని బిహెచ్ డిగ్రీ కాలేజిలో పర్యావరణహిత వినాయక ప్రతిమలను విద్యార్థినులు, అధ్యాప కులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ బి.వి.విజయభాస్కర్, కార్యదర్శి చేగుశ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కౌశల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.రాధామాధవి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు : పర్యావరణ పరిరక్షణకు వినాయకుని మట్టి ప్రతిమలతో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు అధ్యక్షులు డాక్టర్ రవి రాకేష్ దేవ్ పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు ఆధ్వర్యంలో స్థానిక ఐలాండ్ సెంటర్లో వెయ్యి ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎన్ బాలకృష్ణ ప్రతినిధులు జి .శివరామకృష్ణ, ఎంఎం కుద్దుస్, రాజేంద్ర చౌదరి బోడపాటి, రామారావు, గోగినేని రాధాకృష్ణ, కె .రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.